# మహి న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 02 | సంచిక : 181 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య. | పేజీలు : 8 | వెల రూ. 2 | శుక్రవారం -02 - అక్టోంబర్ - 2026

published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana




## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించే జీవోల రద్దు

- ఏపీ స్థానిక ఎన్నికలపై హైకోర్టు కీలక తీర్పు.. 34% బీసీ రిజర్వేషన్లు రద్దు!
- మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని హైకోర్టు స్పష్టీకరణ
- ఆరు వారాల్లోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వానికి ఆదేశం
- వార్డుల పునర్విభజన, ఇతర అంశాలపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన ధర్మాసనం

# బీసీలకు అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే

## స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు

- రేపల్లె ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టత
- ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రేపే సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్తున్నట్లు వెల్లడి
- బాపట్ల జిల్లాలో సూర్యలంక బీచ్‌ను గోవా తరహాలో అంతర్జాతీయ పర్యాటక ల్యాండ్‌మార్క్‌గా అభివృద్ధి చేస్తామని ప్రకటన
- రాష్ట్రంలో రూ. 1 లక్ష కోట్లతో రాయలసీమతో పాటు ప్రకాశం జిల్లాను కలుపుకుని గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు శ్రీకారం



బాపట్ల జిల్లా రేపల్లె: బీసీలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలిచింది... నిలిచేది తామేనని ముఖ్యమమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. బీసీలకు చేయూతను అందించే విషయంలో ఎక్కడా రాజీ పడబోమని తేల్చి చెప్పారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును మిగతా 2 లో

## లోకేశ్‌పై రాజ్‌దీప్ సర్దేశాయ్ ప్రశంసలు..

### ఇతర నేతలు ఆదర్శంగా తీసుకోవాలని సూచన



- కొచ్చిలో జరిగిన ఓ కార్యక్రమంలో లోకేశ్‌ను ఇంటర్వ్యూ చేసిన రాజ్‌దీప్
- స్క్రిప్ట్ లేకుండా కఠిన ప్రశ్నలకు సూటిగా బదులిచ్చారని కొనియాడిన వైనం
- చాలా స్పష్టంగా సమాధానాలు ఇచ్చారని ప్రశంస

అమరావతి: సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్.. ఆంధ్రప్రదేశ్ మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్‌పై మిగతా 2 లో



## ఆపరేషన్ త్రిశూల్' ప్రదర్శన స్టాల్‌ను పరిశీలించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

- జిల్లాలో గంజాయి కట్టడికి 661 ఈగిల్ క్లబ్‌ల ఏర్పాటు, 287 కిలోల గంజాయి సీజ్ చేసినట్లు వెల్లడించిన
- జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్
- మహిళలపై నేరాలు 22.55%, పోక్సో కేసులు 50%, హెల్మెట్
- నిబంధనలతో రోడ్డు ప్రమాద మరణాలు 12% మేర తగ్గింపు
- బాపట్ల పోలీస్ శాఖ చేపట్టిన వినూత్న చర్యలు, '



## మమతా వర్గానికి సుప్రీంలో చుక్కెదురు... రూ.804 కోట్ల ఖాతాలపై పిటిషన్ కొట్టివేత

ఢిల్లీ: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వర్గానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. స్తంభింపజేసిన నాలుగు బ్యాంకు ఖాతాలను వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం తోసిపుచ్చింది. ఈ ఖాతాల్లో సుమారు రూ. 804 కోట్ల మేర నిధులు ఉన్నట్లు సమాచారం. మిగతా 2 లో

స్తంభింపజేసిన టీఎంసీ ఖాతాలపై మమతా వర్గం పిటిషన్ కొట్టివేత

నాలుగు బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ. 804 కోట్ల నిధులపై విచారణ

హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

## లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

### యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ

- స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని
- లక్షలాది మంది యువత ఆశయాలకు యూపీఎస్సీ ప్రతీక అని వ్యాఖ్య
- సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలను స్మరించుకున్న ప్రధాని
- భారత పైలట్ స్మిత్ ధైర్యాన్ని కొనియాడిన మోదీ



ఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో మిగతా 2 లో

## మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?

### సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్!

రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ సవాల్

రెండు కుటుంబాల ఆస్తులపై విచారణకు డిమాండ్

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని కోరిన కేటీఆర్

తప్పు తేలితే శిక్షకు సిద్ధమన్న కేటీఆర్

ప్రభుత్వ హామీలపై పోరాటం కొనసాగిస్తామన్న కేటీఆర్



హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల వ్యవహారం మరోసారి మిగతా 2 లో



## '9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్న భారతీయుడు'.. కెప్టెన్ స్మిత్‌పై మోదీ ప్రశంసలు

- స్మిత్ అసాధారణమైన ధైర్యాన్ని ప్రదర్శించారని కితాబు
- ఇప్పటికే స్మిత్‌ను 'హీరో'గా అభివర్ణించిన మోదీ
- తీవ్ర విషాదాన్ని ఆపారంటూ నెతన్యాహు సైతం ప్రశంసలు
- ప్రస్తుతం సౌదీలో చికిత్స పొందుతున్న స్మిత్
- ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు అధికారుల వెల్లడి

# విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపిస్తున్నాం

## చేనేత కార్మికులకు, చేతివృత్తులకు ఇది ప్రధాన కేంద్రం

- వస్త్ర పరిశ్రమకు సిరిసిల్ల అడ్డా
- అగ్గిపెట్టెలో చీరను మడతపెట్టే నైపుణ్యం ఇక్కడి నేత కార్మికుల ప్రత్యేకత
- "మనిషి నాగరికత వస్త్రంతో ప్రారంభమైంది
- ప్రమాదవశాత్తు కార్మికులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబాలను ఆదుకోవడానికి రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించే ప్రత్యేక విధానం అమలు చేస్తున్నాం



హైదరాబాద్: ఒకవైపు సంక్షేమ పథకాలు, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన -- ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి సిరిసిల్ల పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. సిరిసిల్ల నేతన్నల ప్రాశస్త్యాన్ని మిగతా 2 లో

## బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకోబోదని స్పష్టం చేసిన కిషన్ రెడ్డి



- ఓటమి భయంతోనే కాంగ్రెస్ ఈసీపై దాడి చేస్తోందని ఆరోపణ
- హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా సీఎం రేవంత్ వ్యాఖ్యలు
- కాంగ్రెస్ దొంగ ఓట్లను చేర్పించే ప్రయత్నం చేస్తోందని విమర్శ
- బీఆర్ఎస్‌తో పొత్తు, ఖైరతాబాద్‌లో బీజేపీ పోటీపై కిషన్ రెడ్డి ఏమన్నారంటే?

హైదరాబాద్: ఖైరతాబాద్ లో బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ నాయకుడు జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో ఈ పొత్తుపై జరుగుతున్న ఊహాగానాలకు ఆయన తెరదించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యామని,

MAHI NEWS Epaper: https://epaper.mahinewsindia.com తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## పుస్తకం 'ఉత్త' భూషణం

'తల్లీ నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్' అంటూ సరస్వతీ ప్రార్థనతో ఒక చాటుపద్యం ప్రారంభమవుతుంది. 'నువ్వు నా మనసులో నిలిచి, మంచి, అందమైన మాటల్ని ధారగా ఇష్టంగా నాతో పలికించ'మని ఆ పద్యకవి ఆమెను ప్రార్థిస్తాడు. 'జగత్తునే మోహపెట్టేదిగా, విప్పారిన కన్నులూ, పూర్ణచంద్రునివంటి ముఖమూ కలిగినదిగా' ఆమెను సంబోధిస్తాడు. మరో కోణంలో ఈ పద్యం పుస్తకమెలా ఉండాలో చెబుతోంది-- అది వాగ్ధారతోనే కాక, ఆ వాక్కులు మంచివిగానూ, అందంగానూ ఉండాలంటోంది. సరస్వతికి ఉపయోగించిన విశేషణాలను పుస్తకానికి కూడా అన్వయిస్తే, అది పాఠకజగత్తును మోహపెట్టేలా, వారి చూపుల్ని విశాలపరిచేలా, పూర్ణచంద్రుడిలా ఆహ్లాదం గొలిపేలా ఉండాలి. పుస్తకమెలా ఉండాలో చెప్పడమంటే, ఎలా ఉండకూడదో చెప్పడమే. పుస్తకాన్ని దేవతతో ముడిపెట్టడమంటేనే, దానికి పవిత్రతను ఆపాదించడం!. అందం, ఆహ్లాదం, పవిత్రతా వగైరాలనలా ఉంచితే, పుస్తకంపట్ల కనీసమైన భక్తి శ్రద్ధలను, బాధ్యతను చాటుకుంటున్నామా? తొలినాటి వాగ్రూపదశ దాటి, లేఖనంతో మొదలైన తాళపత్రాలు, భూర్జపత్రాలదశలోకీ కాగితం దశలోకీ అడుగుపెట్టి అక్కడి నుంచి తాజాగా ఆడియో పుస్తకాల రూపంలో మరోసారి వాగ్రూపానికి చేరుకున్న ఇన్ని వందల, వేల సంవత్సరాల వ్యవధిలో కూడా పుస్తకరచననూ, ప్రచురణనూ ఉన్నత ప్రమాణాలు కలిగిన ఒక వ్యవస్థగా మనం పూర్తిగా అభివృద్ధి చేసుకోగలిగామా? సినిమా వంటి నిన్నమొన్నటి జనమాధ్యమాలతో పోటీపడే స్థాయిలో పుస్తకాన్ని జనసామాన్యంలోకి తీసుకెళ్ళగలిగామా? కవులు, రచయితలకిచ్చే గుర్తింపును-- నటులకు, నాయకులకు ఇచ్చే గుర్తింపులో సగానికైనా పెంచగలిగామా? ఇప్పుడు మరింత ఎక్కువమందికి అందు బాటులోకి వచ్చిన పుస్తకం ద్వారా జ్ఞాన, విజ్ఞాన, సారస్వతవ్యాప్తిలో మరింత పురోగ మనాన్ని సాధించే బదులు తిరోగమనాన్ని చిత్రగించిన దాఖలాల సంగతేమిటి?! . సరస్వతిలానే ప్రకృతి కూడా తల్లే. ఆ తల్లి జీవపరిణామ క్రమంలో మనిషికి మెదడు నిచ్చింది; ఆ మెదడు జ్ఞాన, విజ్ఞాన, సారస్వతావిష్కారాల వైపు మనిషిని నడిపించింది; మెదడుకు సమాంతరంగా ప్రకృతి ప్రసాదించిన మాట ఆ జ్ఞాన, విజ్ఞానాదులను తోటి మనిషితో పంచుకునే సౌలభ్యమిచ్చింది. అప్పటినుంచీ జ్ఞాన, విజ్ఞానవ్యాప్తిలో మనిషి మడమ తిప్పింది లేదు. వాక్కునే జ్ఞానవాహిక చేసుకుని మాటలల్లి, వాటికి ఆటపాటలు జోడించి జనంలోకి తీసుకెళ్ళి భావి కావ్యేతిహాసాలకు బీజావాపం చేసిన చరిత్ర మనిషిది. ఆదికవి నన్నయ భట్టు తన ఆంధ్రమహాభారత కృతిభర్త రాజరాజనరేంద్రుని ఆస్థానాన్ని వర్ణిస్తూ-- అపార శబ్దశాస్త్రపారగులైన వైయాకరణులు, భారతరామాయణాద్యనేక పురాణ ప్రవీణులైన పౌరాణికులు, నవార్థవచనరచనా విశారదులైన మహాకవులు, సమస్తశాస్త్ర సాగర గరీయ ప్రతిభులైన తార్కికులు మొదలైన విద్వజ్జనాలు ఆయనను పరివేష్ఠించి ఉన్నారంటాడు. శ్రీనాథ మహాకవి విజయనగరంలో ప్రౌఢదేవరాయల ఆస్థాన పండితు డైన గౌడడిండిమ భట్టును శాస్త్రవాదంలో ఓడించి అతని కంచుఢక్కను పగులగొట్టించడం మరో ప్రసిద్ధ ఉదాహరణ. ఏ జ్ఞానరంగంలోనైనా అపశబ్దాలు, అపరిణతులు, అతర్కాలు, కుతర్కాలు చోటు చేసుకోకుండా ఆనాటి గురువులతోపాటు, పండితపరిషత్తులు అంకుశంలా పనిచేస్తూ జ్ఞానస్వచ్ఛతను పరిరక్షించడానికి ప్రయత్నించాయి. ఇప్పటి పుస్తక ప్రచురణ భాషలో చెప్పాలంటే 'పరిష్కర్త' పాత్రను నిర్వహించాయి. అటువంటిది, కాగితమూ, అచ్చుయంత్రమూ అందుబాటులోకి రావడంతో పుస్తకరూపం ధరించిన జ్ఞానం పండిత పరిషత్తు లనూ, రాజాస్థానాలను దాటి వందల సంవత్సరాల క్రితమే ప్రజాస్థానంలోకి అడుగు పెట్టినా, మనదేశంలో ఇప్పటికీ పుస్తకప్రచురణ ఉన్నత ప్రమాణాలు కలిగిన వ్యవస్థగా అభివృద్ధి చెందకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? పుస్తకమూ, పుస్తక రచనా ప్రజాస్వామికమవుతూ అన్ని వర్గాలకూ అందుబాటులోకి రావడం శుభపరిణామ మను కుంటే; 'పరిష్కర్త' రూపంలో అంకుశం లోపించి నాణ్యత అడుగంటడాన్ని ఎలా చూడాలి? దాంతో పుస్తకాలు అనేకం అమ్ముకునే స్థాయికి చేరకుండా ఉచితంగా పంచి పెట్టే స్థాయిలోనే ఉండిపోతున్నాయి. దాని ప్రభావం మంచి పుస్తకాలపైనా పడుతోంది. ఇప్పటికైనా మేలుకుని ప్రచురణ రంగాన్ని ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుకోకపోతే హస్తభూషణం కావలసిన పుస్తకం 'ఉత్త' భూషణంగానే ఎప్పటికీ ఉండిపోతుంది.

## '9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్న భారతీయుడు'.. కెప్టెన్ స్మిత్‌పై మోదీ ప్రశంసలు

ఢిల్లీ: ఫ్లైదుబాయ్ విమానంలో పెను ప్రమాదాన్ని అడ్డుకున్న భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. తీవ్రంగా గాయపడినా సమయస్ఫూర్తి, ధైర్యంతో వ్యవహరించి 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్నారని కొనియాడారు. గురువారం ఢిల్లీలో జరిగిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శతాబ్ది వేడుకల్లో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. "కెప్టెన్ స్మిత్ అసాధారణమైన సహనం, సమయస్ఫూర్తి, ధైర్యాన్ని ప్రదర్శించారు. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లు.. ఒక భారతీయుడు 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్నాడు" అని మోదీ పేర్కొన్నారు. అంతకుముందు కూడా స్మిత్‌ను 'హీరో'గా అభివర్ణించిన ప్రధాని.. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బుధవారం బయలుదేరిన ఫ్లైదుబాయ్ ఎఫ్‌జెడ్1073 విమానంలో కాక్‌పిట్‌లో ఇద్దరు పైలట్ల మధ్య ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. ఇజ్రాయెల్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. స్మిత్ మచ్చార్‌పై దాడి చేసి కో-పైలట్ విమానాన్ని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో విమానం ఒక్కసారిగా భారీగా కిందకు దిగొచ్చింది. దాదాపు 17,000 అడుగుల ఎత్తు ఒక్క నిమిషంలోనే కోల్పోయినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ వివరాలు వెల్లడించాయి. తీవ్రంగా గాయపడిన స్మిత్ మచ్చార్ కాక్‌పిట్ తలుపు తెరిచేందుకు ప్రయత్నించడంతో ప్రయాణికులు, సిబ్బంది లోపలికి వెళ్లగలిగారు. అనంతరం దాడికి పాల్పడిన కో-పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్‌కు మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానంలో 174 మంది ఉన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కూడా స్మిత్ ధైర్యాన్ని ప్రశంసించారు. ఆయన చర్యల వల్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విషాదానికి దారితీసే ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. స్మిత్ ప్రస్తుతం సౌదీ అరేబియాలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు భారత అధికారులు తెలిపారు.

## సీఎం రేవంత్ పాదయాత్రకు నీరాజనం

కరీంనగర్: ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి తొలిసారిగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అడుగుపెట్టారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంలో మంత్రులతో కలిసి సీఎం నేతృత్వంలో నిర్వహించిన పాదయాత్ర కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. అంబేడ్కర్ చౌక్ నుంచి బహిరంగ సభాస్థలి వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర 40 నిమిషాల పాటు కొనసాగిన పాదయాత్రకు కాంగ్రెస్ కార్యకర్తలు, యువత భారీగా తరలివచ్చారు. దారిపొడవునా స్థానిక మహిళలు, నేత కార్మికులు సీఎంకు మంగళహారతులు, బోనాలతో ఘన స్వాగతం పలికారు. ఎత్తయిన భవనాలు ఎక్కి ముఖ్యమంత్రి వైపు చేతులు ఊపుతూ సంబరపడ్డారు. ర్యాలీలో యువకులు భారీగా పాల్గొన్నారు. సీఎంతో ఫొటోలు దిగడానికి పోటీపడ్డారు. కాంగ్రెస్ శ్రేణుల నినాదాలతో సిరిసిల్ల వీధులు మార్మోగాయి. రేవంత్‌రెడ్డి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. దారిలో కొంతమంది మహిళలు వినతిపత్రాలతో నిలబడగా.. సీఎం వారి వద్దకు వెళ్లి తీసుకున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాదయాత్రలో ఆద్యంతం ఉత్సాహంగా కనిపించారు. డ్యాన్స్ చేస్తూ.. యువతను ఉత్సాహపరుస్తూ ముందుకు సాగారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాదయాత్రలో పాల్గొన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా రూ.345.78 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పెద్దూరులో రూ.5 కోట్లతో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనాన్ని ప్రారంభించారు. రూ.15.25 కోట్లతో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాలు, తంగళ్లపల్లి, వీర్నపల్లి, రుద్రంగి, వేములవాడ మండలాల రెవెన్యూ కార్యాలయాల నిర్మాణానికి శ్రీకారం. సిరిసిల్ల పట్టణం, కోనరావుపేట మండల కేంద్రంలో రూ.16.13 కోట్లతో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూళ్లకు శంకుస్థాపన.

సిరిసిల్లలో రూ.200 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, రాజన్న ఆలయంలో ఫేజ్-1లో రూ.99.4 కోట్లతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు శ్రీకారం. రుద్రంగిలో 10 వేల టన్నుల సామర్థ్యంతో రూ.10 కోట్లతో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ నిర్మించనున్న గోదాం, సిరిసిల్లలో చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో నేత బజారు పనులకు శంకుస్థాపన. వేములవాడలో మహిళా పోలీస్‌స్టేషన్, వేములవాడ, సిరిసిల్లలో రెండు ట్రాఫిక్ ఠాణాలకు శంకుస్థాపన.

## ప్రజలు ఇచ్చిన అధికారాన్ని బాధ్యతగా తీసుకుని పనిచేస్తున్నాం: సీఎం చంద్రబాబు

రేపల్లె: పేదలకు న్యాయం చేయాలనే బాధ్యతతో పనిచేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రతి నెలా నాలుగు సార్లు ప్రజల ముందుకు వస్తున్నామని చెప్పారు. ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ, 9న మీ భూమి-మీ హక్కు, ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర, నాలుగో శనివారం సంజీవని కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు సీఎం తెలిపారు. గత 28 నెలలుగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నట్లు వివరించారు. బాపట్ల జిల్లా రేపల్లెలో నిర్వహించిన పింఛన్ల పంపిణీలో సీఎం పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. "చీఫ్ మినిస్టర్ అంటే కామన్ మ్యాన్ అని నేను విశ్వసిస్తున్నా. ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకుంటూ పనిచేస్తున్నా. గత పాలకులు సృష్టించిన భూ వివాదాలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నాం. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని బాధ్యతగా తీసుకుని నిత్యం ప్రజా సేవకులుగా పనిచేస్తున్నాం. గడచిన రెండేళ్లుగా ప్రతి వ్యక్తికి, ప్రతి కుటుంబానికి సాధికారిత తీసుకువస్తున్నాం. రాష్ట్రంలో ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నికల్లో ప్రజలు కొట్టిన దెబ్బకు గొడ్డలి పార్టీ నేతలు అలిగి అసెంబ్లీకి కూడా రాకుండా ముఖం చాటేస్తున్నారు. గత పాలకులు అన్ని వ్యవస్థల్నీ భ్రష్టు పట్టించారు. రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారు. సంకల్పంతో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఒక్కో ఇటుకా పేరుస్తూ రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తున్నాం. ఆర్థిక సవాళ్లు అధిగమించి సంక్షేమం అందిస్తున్నాం. పెన్షన్లకే ఇప్పటి వరకు రూ.76 వేల కోట్లు ఖర్చు చేశాం. వెంటిలేటర్ పై ఉన్న ఆర్థిక వ్యవస్థకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆక్సిజన్ ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఉంది. బుల్లెట్ స్పీడ్‌తో సుపరిపాలన అందిస్తున్నాం. పేదరికాన్ని ఆర్థిక కోణంలో కాకుండా మానవీయ కోణంలో ఆలోచించి ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని చూస్తున్నాం. సంక్షేమంతో పాటు పీ4 కార్యక్రమం ద్వారా అట్టడుగున ఉన్న వారికి చేయూత అందించేలా చర్యలు చేపట్టాం. బంగారు కుటుంబాలను ఎంపిక చేసి వారి జీవన ప్రమాణాలను పెంచేలా చర్యలు తీసుకున్నాం." అని చంద్రబాబు అన్నారు.

# బీసీలకు అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్లనున్నట్లు తెలిపారు. బీసీలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. బాపట్ల జిల్లా రేపల్లెలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రజావేదికలో సీఎం ప్రసంగించారు. నాడు బీసీలకు రాజకీయంగా ఎన్టీఆర్ గుర్తింపు తెచ్చారని.. తాను వారికి అండగా నిలబడి ప్రోత్సహించానని సీఎం అన్నారు. 1995లో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు తెచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చాక రిజర్వేషన్లను 24 శాతానికి కుదించిందన్నారు. తద్వారా 16,800 మంది పదవీ అవకాశాలు కోల్పోయారని ముఖ్యమంత్రి అన్నారు. దీనిపై సీఎం మాట్లాడుతూ.." ఇప్పుడు మళ్లీ మేం అధికారంలోకి వచ్చాక బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తే గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లింది. హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. 50 శాతం కంటే రిజర్వేషన్లు పెరగకూడదని కోర్టులో వాదించారు. కోర్టు ఆ జీవోలను కొట్టేసింది. దీనిపై రేపే ఈ సుప్రీం కోర్టులో అప్పీలుకు వెళ్తున్నాం. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా పైకి తీసుకురావటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వని వ్యక్తులు.. మేం మెగా డీఎస్సీ తో ఉద్యోగాలు ఇస్తే ఆరోపణలు చేస్తున్నారు. 350 కేసులు కోర్టుల్లో వేసి నియామక ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేశారు. వెనుకబడిన వర్గాలపై ద్వేషంతో కోర్టులకు వెళ్లి అడ్డంకులు సృష్టించే రిజర్వేషన్లు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏది ఏమైనా బీసీలను రాజకీయంగా అండగా నిలబడే బాధ్యతను మేం తీసుకుంటాం. ఈ ప్రాంతంలో బీసీ బిడ్డ అనగాని భగవంతరావు చక్కగా పనిచేశారు. ఇప్పుడు మంత్రిగా అనగాని సత్యప్రసాద్ ప్రజల కోసం పనిచేస్తున్నారు. బీసీలుగా నాయకులు రాజకీయంగా ఎదిగే అవకాశాలు కల్పించేది కూటమి ప్రభుత్వమే." అని ముఖ్యమంత్రి అన్నారు.

జీవన ప్రమాణాలు పెంచటమే లక్ష్యం

"గడచిన 28 నెలలుగా ప్రతీ నెలా మొదటి తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొంటున్నాను. చీఫ్ మినిస్టర్ అంటే కామన్ మ్యాన్ అని నేను విశ్వసిస్తున్నాను. ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకుంటూ పనిచేస్తున్నాను. పేదలకు న్యాయం చేయాలన్న బాధ్యతతో మేం పనిచేస్తున్నాం. ప్రతినెలా నాలుగు మార్లు ప్రజల ముందుకు వస్తున్నాం. ప్రతీ నెలా 1 తేదీన పేదలకు ఆర్థిక భద్రత కల్పించే పెన్షన్ల కార్యక్రమం, 9 తేదీన మీ భూమి- మీహక్కు కార్యక్రమంలో పాల్గొంటున్నాం. గత పాలకులు సృష్టించిన భూ వివాదాలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నాం. ఇక ప్రతిమూడో శనివారం పర్యావరణాన్ని కాపాడే స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి , 4వ శనివారం సంజీవని కార్యక్రమానికి హాజరవుతున్నాను. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని బాధ్యతగా తీసుకుని నిత్యం ప్రజా సేవకులుగా పనిచేస్తున్నాం. గడచిన రెండేళ్లుగా ప్రతీ వ్యక్తికి, ప్రతీ కుటుంబానికి సాధికారిత తీసుకువస్తున్నాం. రాష్ట్రంలో ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. గొడ్డలి పార్టీ నేతలు ప్రజలు కొట్టిన దెబ్బకు అలిగి అసెంబ్లీకి కూడా రాకుండా ముఖం చాటేస్తున్నారు. గత పాలకులు అన్ని వ్యవస్థల్నీ భ్రష్టు పట్టించారు. రాష్ట్రాన్ని విధ్వంసం సృష్టించారు. కష్టంతో సంకల్పంతో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఒక్కో ఇటుకా పేరుస్తూ రాష్ట్ర పునర్నిర్మాణం చేస్త?న్నాం. ఆర్థిక సవాళ్లు అధిగమించి సంక్షేమం అందిస్తున్నాం. పెన్షన్లకే ఇప్పటికి రూ.76 వేల కోట్లు ఖర్చు చేశాం. వెంటిలేటర్ పై ఉన్న ఆర్థిక వ్యవస్థను కేంద్ర సహకారంతో ఆక్సిజన్ ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు, బుల్లెట్ స్పీడ్ తో సుపరిపాలన అందిస్తున్నాం. పేదరికాన్ని ఆర్థిక కోణంలో కాదు మానవీయ కోణంలో ఆలోచించి జీవన ప్రమాణాలు పెంచడానికి చూస్తున్నాం. సంక్షేమంతో పాటు పీ4 కార్యక్రమం ద్వారా అట్టడుగున 20 స్థాయి మందికి చేయూత అందించేలా చర్యలు చేపట్టాం. బంగారు కుటుంబాలను ఎంపిక చేసి వారి జీవన ప్రమాణాలు పెంచేలా చర్యలు తీసుకున్నాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### పర్యాటక ల్యాండ్ మార్క్‌గా సూర్యలంక

"వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. అభివృద్ధితో పాటు పర్యావరణాన్ని కూడా మనం కాపాడుకోవాల్సి ఉంది. అన్ని ప్రాంతాల్లోనూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలి. రాయలసీమ ప్రాంతాన్ని గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ గా మారుస్తున్నాం. రూ.1 లక్ష కోట్లతో ప్రకాశం జిల్లాతో కలిపి 10 జిల్లాలను గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ గా అభివృద్ధి చేస్తాం. ఉద్యాన పంటలతో పాటు లాజిస్టిక్స్ , పర్యాటకం ఇలా అన్ని రంగాల్లో పెట్టుబడులు వస్తాయి.బాపట్లలోని సూర్యలంక బీచ్ దీనిని గోవా తరహాలో అభివృద్ధి చేస్తాం. పర్యాటకుల్ని ఆకర్షించేలా దీనిని తీర్చిదిద్దాలని ప్రణాళికలు చేస్తున్నాం. ఆ పర్యాటకుల్ని ఆకర్షించటం ద్వారా సూర్యలంక దేశ చిత్రపటంలో ఓ ల్యాండ్ మార్క్ గా మారాలి. వాన్ పిక్ ప్రాంతాన్ని గొడ్డలి పార్టీ అధినేత సర్వనాశనం చేశారు. అభివృద్ధే రాకుండా పోయింది. ఇష్టానుసారం అవినీతి చేసి సీబీఐ, ఈడీ కేసుల్లో ఇరుక్కున్నాడు. వాన్ పిక్ ద్వారా అద్భుతమైన పారిశ్రామిక టౌన్ షిప్ తయారు కావాల్సిన ప్రాంతాన్ని నాశనం చేశారు. ప్రజలకు జవాబుదారీ పరిపాలన ఇవ్వాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాలు కల్పించి మెరుగైన పౌరసేవలు అందించేలా చర్యలు చేపడుతున్నాం. ఐగాట్- మిషన్ కర్మయోగి కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఈ నైపుణ్యాలను పెంచుతోంది. మన ఉద్యోగులు 2.2 కోట్ల కోర్సులు చేసి దేశంలోనే ఏపిని అగ్రస్థానంలో నిలిపారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు 4 వేల పైచిలుకు కోర్సులు చేసి నైపుణ్యాలు సాధించింది. ఇప్పుడు తన విద్యార్థులకు ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా విద్యను అందించేందుకు ఆ నైపుణ్యాలు ఆమెకు ఉపయోగ పడుతున్నాయి. వ్యక్తిగతంగా మనం కూడా మనమన రోజువారీ కార్యక్రమాలను మరింత మెరుగ్గా నిర్వహించుకోవాలంటే నైపుణ్యాలు పెంచుకోవాలి. సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చూడటం కాకుండా నైపుణ్యాలు పెంచుకునే అంశంపై సమయం కేటాయించాలని కోరుతున్నాను." అని సీఎం సూచించారు.

### అభివృద్ధి అంశంలో రాజీలేదు

"గత పాలకులు పట్టాదారు పాస్ పుస్తకాలు, సర్వేరాళ్లపై బొమ్మలు వేసుకోడానికి రూ.800 కోట్లు ఖర్చు పెట్టారు. రీసర్వే 2.0 ద్వారా భూవివాదాలు పరిష్కరించి రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నాం. శెట్టిపల్లి, కంగుమంది, అమలాపురం తదితర ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఉన్న భూసమస్యల్ని పరిష్కరించాం. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా రెవెన్యూ రికార్డులను భద్రంగా పెడుతున్నాం. ఇప్పటికే 5.5 లక్షల ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందించాం. మరో 5.5 లక్షల ఇళ్లను త్వరలోనే నిర్మించి ఇస్తాం. పౌర సేవల్ని ప్రజలకు దగ్గర చేసేలా వాట్సప్ గవర్నెన్స్ ద్వారా సేవలు అందిస్న?న్నాం. డీప్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక రోజులు, నెలలు పట్టాల్సిన పనులు ఇప్పుడు నిముషాల్లోనే పూర్తి అవుతోంది. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ వివిధ రంగాల్లో అభివృద్ధి సాధిస్తోంది. రాష్ట్రంగా మనం అవకాశాలను అందిపుచ్చుకోవాలి. విశాఖకు డేటా సెంటర్లు తీసుకువస్తే గొడ్డలి పార్టీ నీటి సమస్య అంటూ అడ్డుపడుతోంది. అమరావతి అంటే ఎడారి అని, శ్మశానమని, మావిగన్ అంటున్నారు. అడ్డంకులకు ఆగిపోను, అభివృద్ధి విషయంలో రాజీ పడను. నాయకుడంటే ప్రజల రేపటి భవిష్యత్ గురించి ఆలోచన చేయాలి. అందుకే 2047 స్వర్ణాంధ్ర లక్ష్యంతో పనిచేస్తున్నాను. సమాజంలో చిట్టచివరి వ్యక్తి జీవన ప్రమాణాలు పెంచేలా చర్యలు చేపట్టాం. ఆదాయం, ఆరోగ్యం, ఆనందం అనే విధానంతో ముందుకు వెళ్తున్నాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశానికి మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ కృష్ణప్రసాద్, నేతలు మోపిదేవి వెంకటరమణ తదితరులు హాజరయ్యారు.

## మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా? సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్!

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల వ్యవహారం మరోసారి వేడెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తులతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విచారణలో తమ తప్పు తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్ల పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి తమ కుటుంబ ఆస్తులపై చేసిన ఆరోపణలకు కేటీఆర్ స్పందించారు. వ్యాపారం చేయడం తప్పా? అని ప్రశ్నించారు. తాను 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించానని చెప్పారు. ప్రస్తుతం మూడు హోటళ్లు ఉన్నాయని తెలిపారు. తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించానని పేర్కొన్నారు. సిరిసిల్లలో చేనేత కార్మికుల సమస్యలను సీఎం పట్టించుకోలేదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న 35 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల పరిహారం ప్రకటిస్తారని ఆశించామని చెప్పారు. అయితే సీఎం తన పర్యటనలో రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఇక హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

## లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

ఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేడుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించే జీవోల రద్దు




అమరావతి: ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 104, 1065లను రద్దు చేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఈ జీవోలు ఉల్లంఘిస్తున్నాయని స్పష్టం చేసింది. ఆరు వారాల్లోగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు, వార్డుల పునర్విభజన, ఎన్నికల వాయిదా తదితర అంశాలపై దాఖలైన పలు పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించడం వల్ల మొత్తం రిజర్వేషన్ల కోటా 50 శాతాన్ని దాటుతోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్లు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, రిజర్వేషన్లు 50 శాతం లోపే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తూ సదరు జీవోలను కొట్టివేసింది. అదే సమయంలో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేసింది. వార్డుల పునర్విభజన ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. 'సర్' ప్రక్రియ పూర్తయ్యాకే ఎన్నికలు జరపాలంటూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు, బీసీ జనాభా గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలను కూడా కోర్టు కొట్టివేసింది. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సైతం తోసిపుచ్చింది. మొత్తం మీద ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది. కేవలం రిజర్వేషన్ల శాతాన్ని మాత్రమే సమీక్షించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో స్థానిక పోరుకు అడ్డంకులు తొలగిపోయాయి. అయితే, ఇప్పుడు ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎలా ముందుకు వెళుతుంది? కోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి లోబడి కొత్త ఫార్ములాను ఎలా రూపొందిస్తుంది? అనేది ఆసక్తికరంగా మారింది. కోర్టు ఆదేశాల మేరకు ఆరు వారాల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండటంతో ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై ఒత్తిడి పెరిగింది.

## బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకోబోదని స్పష్టం చేసిన కిషన్ రెడ్డి

హైదరాబాద్: ఖైరతాబాద్ లో బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ నాయకుడు జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో ఈ పొత్తుపై జరుగుతున్న ఊహాగానాలకు ఆయన తెరదించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యామని, అయితే ఈసారి బీజేపీ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే ముందుకు వెళుతుందని స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బొగ్గు కేటాయింపులపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే, సింగరేణి బొగ్గును వినియోగించుకునేలా ఈ ప్లాంట్‌కు ఎందుకు రూపకల్పన చేయలేదో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వైఖరిని కిషన్ రెడ్డి తీవ్రంగా ఎండగట్టారు. రాహుల్ గాంధీ రాజ్యాంగబద్ధమైన సంస్థలపై, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌పై అనుచిత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో మార్పు అనేది ప్రజల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందే తప్ప, రాహుల్ గాంధీ వల్ల సాధ్యం కాదన్నారు. శివుడు, రాముడిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీశాయని, వాటిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు కేంద్ర ఎన్నికల సంఘంపై, బీజేపీపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రాంతాల వారీగా ప్రజల మధ్య చిచ్చుపెడుతోందని, తొలగించిన ఓట్లను (మరణించిన వారు, అక్రమ చొరబాటుదారులు) తిరిగి ఓటర్ల జాబితాలో చేర్పించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఖైరతాబాద్‌లో బీజేపీ గెలుపు తథ్యమని, తమ పార్టీ ఓట్లను దొంగిలించదని, కేవలం ప్రజల హృదయాలను గెలుచుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

## లోకేశ్‌పై రాజ్‌దీప్ సర్దేశాయ్ ప్రశంసలు.. ఇతర నేతలు ఆదర్శంగా తీసుకోవాలని సూచన

అమరావతి: సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్.. ఆంధ్రప్రదేశ్ మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్‌పై ప్రశంసలు కురిపించారు. తాను చేసిన ఇంటర్వ్యూలో లోకేశ్ వ్యవహరించిన తీరును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కఠినమైన ప్రశ్నలకు కూడా ఎలాంటి స్క్రిప్ట్ లేకుండా సూటిగా, స్పష్టంగా సమాధానాలు ఇచ్చారని కొనియాడారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే సౌత్ కాంక్లేవ్‌లో రాజ్‌దీప్ సర్దేశాయ్.. మంత్రి లోకేశ్‌ను ముఖాముఖి ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా ఏపీ అభివృద్ధి, జాతీయ రాజకీయాలు, ఇతర అంశాలపై పలు ప్రశ్నలు సంధించారు. ఇంటర్వ్యూ చివరలో రాజ్‌దీప్ మాట్లాడుతూ... మీరు అడగబోయే ప్రశ్నల జాబితా ముందే ఇవ్వండి అని అడగని నాయకులను ఇంటర్వ్యూ చేయడం ఎప్పుడూ సులభంగా ఉంటుందని అన్నారు. ఈ ఇంటర్వ్యూపై లోకేశ్ సోషల్ మీడియా వేదికగా నిన్న స్పందించారు. ఈ చర్చలో దేశం గురించి, రాష్ట్రం గురించి, పాలన గురించి, భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడినట్టు వెల్లడించారు. ఎలాంటి స్క్రిప్ట్ అవసరం లేకుండానే రాజ్‌దీప్ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చానని తెలిపారు. అందుకు రాజ్ దీప్ నేడు సోషల్ మీడియా ద్వారా స్పందించారు. ఇంటర్వ్యూలో అడిగే ప్రశ్నలపై గతంలో నాయకులందరూ ఇలాగే ఉండేవారని, కానీ ఇప్పుడు అది చాలా అరుదుగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ఇతర నేతలు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకుంటారని భావిస్తున్నాను అంటూ రాజ్‌దీప్ మంత్రి లోకేశ్ కు కితాబిచ్చారు.

## మమతా వర్గానికి సుప్రీంలో చుక్కెదురు... రూ.804 కోట్ల ఖాతాలపై పిటిషన్ కొట్టివేత

ఢిల్లీ: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వర్గానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. స్తంభింపజేసిన నాలుగు బ్యాంకు ఖాతాలను వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం తోసిపుచ్చింది. ఈ ఖాతాల్లో సుమారు రూ. 804 కోట్ల మేర నిధులు ఉన్నట్లు సమాచారం. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ పి.బి. వరాలేలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. కలకత్తా హైకోర్టు గతంలో జారీ చేసిన ఉత్తర్వులలో జోక్యం చేసుకునేందుకు ధర్మాసనం నిరాకరించింది. పార్టీలో నెలకొన్న వర్గపోరు కారణంగా కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే పార్టీ గుర్తును స్తంభింపజేసిందని, ఈ నేపథ్యంలో సదరు నిధులు యాజమాన్య హక్కులపై స్పష్టత రావాల్సి ఉందని కోర్టు అభిప్రాయపడింది. ఈ దశలో నిధుల వినియోగంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేమని స్పష్టం చేస్తూ, కేసు విచారణను వేగవంతం చేయాలని కలకత్తా హైకోర్టును ఆదేశించింది. ఆర్థిక అవకతవకల ఆరోపణలు, పలు ఎఫ్ఐఆర్‌ల నమోదు నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ పోలీసులు ఈ నాలుగు ఖాతాలను స్తంభింపజేశారు. దీనిపై మమతా వర్గం కలకత్తా హైకోర్టును ఆశ్రయించగా, ఆగస్టు 27న వారికి ఎటువంటి మధ్యంతర ఊరట లభించలేదు. అయితే, రోజువారీ పార్టీ నిర్వహణ ఖర్చుల కోసం కోర్టు నియమించిన ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో ఇతర ఖాతాలను పరిమితంగా వినియోగించుకోవడానికి హైకోర్టు అనుమతినిచ్చింది. ఖాతాల స్తంభనతో పార్టీ కార్యకలాపాలు నిలిచిపోతున్నాయని మమతా వర్గం వాదించినప్పటికీ, సుప్రీంకోర్టు మాత్రం హైకోర్టు నిర్ణయాన్నే సమర్థించింది.

## దేవుళ్ల మధ్య చిచ్చు: రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పరమేశ్వరుడు పేదల దేవుడని, శ్రీరాముడు ధనికుల దేవుడని సీఎం చేసిన వ్యాఖ్యలు మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలతో ఏకంగా దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగారని కిషన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. శివుడు, రాముడి పేర్లతో చేసిన ఈ వ్యాఖ్యలు యావత్ హిందూ సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని, హిందువుల మధ్య అనవసర గొడవలు పెట్టే ప్రయత్నమని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టి, ఇలాంటి కొత్త వివాదాలను ముందుకు తెస్తోందని ఆరోపించారు. ప్రజలను విభజించడం కాంగ్రెస్ పార్టీకి ఎప్పటినుంచో ఉన్న అలవాటు అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ఒక సవాల్ విసిరారు. "హిందూ దేవుళ్లపై మాట్లాడిన విధంగా ఇతర మతాల దేవుళ్ల గురించి మాట్లాడే ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా?" అని ఆయన ప్రశ్నించారు.

## ఎస్ఐ కె. గోపాల్ పదవీ విరమణ ముఖ్యఅతిథిగా

### -జిల్లా ఎస్పీ స్నేహ మెహార



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్):: వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖలో సబ్ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా విధులు నిర్వహించిన కె. గోపాల్ 41 ఏళ్ల సుదీర్ఘ పోలీస్ సేవలను పూర్తి చేసుకుని 30-09-2026న పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు ఎస్పీ శ్రీ రాజేష్ మీనా, కలిసి కె. గోపాల్‌ను ఘనంగా సన్మానించి, ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ స్నేహ మెహ్రా, మాట్లాడుతూ, 41 సంవత్సరాల పాటు పోలీస్ శాఖలో అంకితభావంతో, నిబద్ధతతో విధులు నిర్వహించిన కె. గోపాల్ సేవలను అభినందించారు. పదవీ విరమణ అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. అదనపు ఎస్పీ రాజేష్ మీనా, కూడా కె. గోపాల్ పోలీస్ శాఖకు అందించిన సుదీర్ఘ సేవలను అభినందిస్తూ, ఆయన పదవీ విరమణ అనంతర జీవితం సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు బి. రమేష్ కుమార్, పోలీస్ అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొని కె. గోపాల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, సహచర సిబ్బంది ఆయనతో తమకున్న అనుబంధాన్ని, పోలీస్ శాఖకు ఆయన అందించిన సుదీర్ఘ సేవలను గుర్తుచేసుకున్నారు.





## 13వ వార్డులో నూతన అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం!

### గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవలు మరింత చేరువ



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో నూతన అంగన్‌వాడీ కేంద్రాన్ని మున్సిపల్ కౌన్సిలర్ మీర్ సమీనా తాహేర్ అలీ ప్రారంభించారు. వార్డులోని గర్భిణులు, బాలింతలు, ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్య సేవలు, పూర్వ ప్రాథమిక విద్య అందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.వార్డులోని బిసి కాలనీ, మందుల కాలనీ, ఖాన్ కాలనీకి అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో కాలనీవాసులు చాలా కాలంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ సేవలు పొందేందుకు జాతీయ రహదారి ని దాటి అక్కడ వున్న కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. దీంతో చిన్నపిల్లలతో పాటు మహిళలు రాకపోకల్లో ఇబ్బందులు పడినట్లు స్థానికులు తెలిపారు. ప్రస్తుతం ఖాన్ కాలనీలోనే అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం కావడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ కాలనీలోనే ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రావడం వల్ల మహిళలు, చిన్నారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కేంద్రాన్ని మంజూరు చేసి ప్రారంభించిన కౌన్సిలర్ మీర్ సమీనా తాహేర్ అలీకి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పిల్లలకు బాలామృతం, పౌష్టికాహారం, గుడ్లు, మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య లక్ష్మి పథకం కింద పౌష్టికాహార సేవలు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల సహకారంతో పిల్లలు, గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, టీకాలు నిర్వహించనున్నట్లు అన్నారు. మూడేళ్ల నుంచి ఆరు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు ఆటపాటల ద్వారా పూర్వ ప్రాథమిక విద్య అందించడంతో పాటు వారి శారీరక, మానసిక వికాసానికి అవసరమైన సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. వార్డులోని అర్హులైన గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకొని ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, మహిళలు, చిన్నారులు, పలువురు పాల్గొన్నారు.

## మాచర్ల మండాది బోడు సమీపంలో విషాదం

### బైక్‌ను ఢీకొట్టిన కారు.. రామయ్య అక్కడికక్కడే దుర్మరణం



మాచర్ల ,అక్టోబర్ 01(మహి న్యూస్): పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలోని మండాది బోడు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని గుర్తుతెలియని కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ప్రకాశం జిల్లా కొమ్మరోలుకు చెందిన రామయ్య (28) అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న మరో వ్యక్తి రమేష్ తీవ్రంగా గాయపడగా, చికిత్స నిమిత్తం మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాగార్జునసాగర్‌లో పని ముగించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది . ప్రమాదానికి కారణమైన కారును గుర్తించి మాచర్ల పోలీస్ స్టేషన్ కి తరలించారు, బైక్,మరో వాహనాన్ని కూడా స్టేషన్ వద్దకు తరలించారు, మాచర్ల పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన

### - పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి

### పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్, పరిగి పట్టణ అధ్యక్షుడు గుండెల రామకృష్ణారెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ పర్షమోని చిన్న నరసింహులు తో కలసి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



వికారాబాద్ జిల్లా పరిగి (మహిన్యూస్): పరిగి మున్సిపల్ పరిధిలోని 16 వార్డుకు చెందిన ఖాజా మైనాఉద్దీన్ అనారోగ్యానికి గురి ఆసుపత్రిలో చికిత్స పొందిన తర్వాత ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో ఖర్చైనా 60,000 రూపాయలు సిఎంఆర్ చెక్కును పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి మంజూరు చేయించి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ .. సీఎం రిలీఫ్ ఫండ్, అనారోగ్యానికి గురైన నిరుపేదల వరం అన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్, పరిగి పట్టణ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ వర్షమోని చిన్న నర్సింలు, కాంగ్రెస్ నాయకులు అష్రఫ్, తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాల్లో ఫాం ల్యాండ్స్:-జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పంట పొలాల్లో పామ్ పాండ్ లను నిర్మించుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. గురువారం మోమినిపేట మండలం కొలుకుందా గ్రామ పరిసరాల్లోనీ విబి జి రామ్ జి కింద చేపడుతున్న పనులతో పాటు కస్తూరిబా విద్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సౌకర్యాలు, గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియ జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....అదేవిధంగా జలసిరి పథకం గురించి ప్రజలకు తెలియజేస్తూ గ్రామాల్లో విబి జి రామ్ జి కింద రాంజీ చేపడుతున్న పనులలో భాగంగా పెద్ద మొత్తంలో ఇంకుడు గుంతలు, పొలాల వద్ద నీటి గుంతలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. పనుల నాణ్యతలో రాజీ పడవద్దని, మస్టర్ రోల్ లను సక్రమంగా నిర్వహిస్తూ కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎల్నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గుముఖం పడతాయని ఇంకుడు, నీటి గుంతలు ఏర్పాటు చేసుకోవడం వల్ల ముందు తరాలకు ఎంతగానో దోహదపడుతుందని



దీనికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ తెలిపారు. చంద్రాయన పల్లిలోని కస్తూరిబావిద్యాలయంలో నూతనంగా నిర్మిస్తున్న భవన పనులను త్వరితగతిన చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యాలయ ప్రాంగణంలో పరిశుభ్రంగా ఉండేవిధంగా చూడాలని అదే విధంగా మురుగు నీరు నిలవకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులు ఆయన సూచించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీలలో భాగంగా అవుట్ పేషంట్ రిజిస్టర్, మందుల నిల్వ, ల్యాబ్, సిబ్బంది హాజరు పట్టీకలు ఆయన పరిశీలించారు. వైద్యులు సమయపాలన పాటించాలని, గర్భిణీలకు, బాలింతలకు నిరంతర వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో ప్రసూతి వివరాలను జిల్లా కలెక్టర్ వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. మోమిన్ పేట గ్రామపంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పనులు, నూతనంగా ఓటరుగా నమోదు చేసుకున్న ఫారం-6 లను కలెక్టర్ పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని, తప్పులు లేకుండా జాబితా రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని , తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీఓ సృజన, వైద్యాధికారి బుచ్చిబాబు, ఎంఈఓ నరసింహులు, ఏపీఓ శంకరయ్య, ప్రిన్సిపాల్ పద్మావతి, సర్పంచులు విశాల, శివ కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఇందిర, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించాలి

### - తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

### ఓటర్లను కార్యాలయాలకు పిలిచి నోటీసులు, పత్రాల స్వీకరణ చేయరాదు

### బీఎల్ఓలు ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేసి, పత్రాలను ఇంటి వద్దే స్వీకరించాలి




వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): ఎస్ఐఆర్-2026 ప్రక్రియను భారత ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సీఈఓ సి. సుదర్శన్



రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లను నోటీసులు అందుకోవడానికి లేదా అవసరమైన పత్రాలు సమర్పించడానికి కార్యాలయాలకు పిలవరాదని స్పష్టం చేశారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు, అవసరమైన పత్రాలను వారి ఇళ్ల వద్దే స్వీకరించాలని సూచించారు. ఇకపై సాధారణంగా ఓటర్లను విచారణ (హియరింగ్) కోసం కార్యాలయాలకు పిలవరాదని సీఈఓ తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహించాల్సి వస్తే ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### ఫారం-6 డిక్లరేషన్ తప్పనిసరి

కొత్త ఓటరు నమోదు కోసం ఫారం-6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ తప్పనిసరిగా ఉండాలని సీఈఓ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ నిర్వహించని రాష్ట్రాల్లో డిక్లరేషన్ అవసరం లేకపోయినప్పటికీ, తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు సందర్భంగా డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఈఆర్ఓ కార్యాలయాల నోటీసు బోర్డులపై ఫారం-6, ఫారం-7కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. ఓటర్లకు జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులపై కూడా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ఫారం-6, పెండింగ్ నోటీసులు, ఫారం-7, ఫారం-8కు సంబంధించిన వివరాలను అన్ని స్థాయిల్లోని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందించాలని సీఈఓ ఆదేశించారు. ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేస్తూ, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి దశను పారదర్శకంగా పూర్తి చేయాలని సీఈఓ సి. సుదర్శన్ రెడ్డి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో వాసు చంద్ర, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరెండెంట్ నెమత్ హాలీ ,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమను ప్రపంచ ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దుతాం

అమరావతి/మదనపల్లి, మహి న్యూస్, అక్టోబర్ 1: ఒకప్పుడు కరువుకు చిరునామాగా భావించిన రాయలసీమను దేశానికే కాకుండా ప్రపంచానికే ఉద్యానవన ఉత్పత్తుల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రపంచ ఉద్యాన కేంద్రం -- రాయలసీమ అభ్యుదయం' కార్యక్రమానికి సమగ్ర కార్యాచరణ రూపొందించినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. రైతులు సంప్రదాయంగా తక్కువ ఆదాయం ఇచ్చే వర్షాధార పంటలకే పరిమితం కాకుండా, తక్కువ నీటితో అధిక ఆదాయం ఇచ్చే ఉద్యాన పంటల వైపు అడుగులు వేయాలన్నదే ఈ ప్రణాళిక ప్రధాన ఉద్దేశం. రాయలసీమ ప్రాంతంలో వార్షిక వర్షపాతం పరిమితంగా ఉండటం, తరచూ కరువు పరిస్థితులు ఏర్పడటం, సాగునీటి కొరత, మార్కెట్ అనుసంధానం లోపించడం వంటి సమస్యలను ఒక్కొక్కటిగా కాకుండా నీరు నుంచి మార్కెట్ వరకు రైతుకు ఎదురయ్యే ప్రతి సమస్యకు ఒకేసారి పరిష్కారం చూపేలా సమగ్ర ఉద్యాన అభివృద్ధి ప్రణాళికను రూపొందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యానికి మొదటి నుంచీ అత్యంత ప్రాధాన్యం లభిస్తోంది.

### రూ.1 లక్ష కోట్లతో సమగ్ర ప్రణాళిక

రాయలసీమ సమగ్ర ఉద్యాన అభివృద్ధి ప్రణాళికలో సుమారు రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు ప్రతిపాదించారు. ఇందులో ప్రభుత్వ రంగంలో రూ.40,352 కోట్లు, ప్రైవేటు రంగం నుంచి సుమారు రూ.60 వేల కోట్ల పెట్టుబడులు సమీకరించేందుకు ప్రణాళిక రూపొందించారు. ప్రభుత్వ పెట్టుబడుల్లో సాగునీటి రంగానికి రూ.20,884 కోట్లు, ఉద్యానవన రంగానికి రూ.14,906 కోట్లు, గ్రామీణ రహదారుల అభివృద్ధికి రూ.4,562 కోట్లు ప్రతిపాదించారు. 2026 ఆగస్టు నుంచి 2029 జూలై వరకు మూడు దశల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేసి, 10 జిల్లాల్లోని 201 క్లస్టర్లను (సమూహాలను) అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న ఉద్యాన విస్తీర్ణాన్ని 14.41 లక్షల హెక్టార్లకు పెంచడం, ఉత్పత్తిని దాదాపు రెట్టింపు చేయడం, సుమారు 9.6 లక్షల రైతుల ఆదాయం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం దీని ప్రధాన లక్ష్యం.

### మూడు దశల్లో 'రాయలసీమ అభ్యుదయం'

మొదటి దశలో 2026--27లో రూ.12,066 కోట్లతో 72 సమూహాలపై దృష్టి సారిస్తారు. రిజర్వాయర్లు, ఎత్తిపోతల పథకాలు, చెరువులు, చివరి ఆయకట్టు వరకు నీరు చేరే వ్యవస్థలు, కీలక గ్రామీణ రహదారులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రెండో దశలో 2027--28లో రూ.15,036 కోట్లతో మరో 67 సమూహాలు, మూడో దశలో 2028--29లో రూ.13,250 కోట్లతో మిగిలిన 62 సమూహాలను అభివృద్ధి చేసి మొత్తం 201 సమూహాలను సమగ్ర ఉద్యాన ఉత్పత్తి--ప్రాసెసింగ్--మార్కెటింగ్ కేంద్రాలుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

### నీటి భద్రతే మొదటి ప్రాధాన్యం



రాయలసీమ రైతుకు నీటి భద్రత కల్పించకుండా ఉద్యాన విప్లవం సాధ్యం కాదు. అందుకే నీరు--పంట--మార్కెట్ అనే మూడు అంశాలను ఒకే ప్రణాళికలో అనుసంధానిస్తున్నారు. ప్రణాళికలో భాగంగా సుమారు 9 లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు, మరో 4.3 లక్షల ఎకరాల ప్రస్తుత ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా సాగునీటి ప్రాజెక్టులను అనుసంధానిస్తున్నారు. రైతుల ఉత్పత్తులను వేగంగా మార్కెట్లకు తరలించేందుకు 5,721 కిలోమీటర్ల గ్రామీణ రహదారుల అభివృద్ధి కూడా ప్రతిపాదించబడింది. తుంపర సేద్యం, బిందు సేద్యం, ఫర్టిగేషన్ వంటి సూక్ష్మ సాగునీటి విధానాలను పెద్దఎత్తున విస్తరించి, ప్రతి నీటి బొట్టుకూ ఎక్కువ పంట--ప్రతి ఎకరాకు ఎక్కువ ఆదాయం అనే విధానంతో ముందుకు వెళ్లనున్నారు.

### పంట పండించడం మాత్రమే కాదు..

### రైతే విలువ జోడింపులో భాగస్వామి

ఉద్యాన పంటలను సాగు చేయించడం దగ్గరే ప్రభుత్వ బాధ్యత ముగియదు. పంట కోత, గ్రేడింగ్, సార్టింగ్, ప్యాకింగ్, శీతల గిడ్డంగులు, శుద్ధి చేయడం, బ్రాండింగ్, రవాణా, దేశీయ, అంతర్జాతీయ మార్కెటింగ్ వరకు మొత్తం విలువ గొలుసును అభివృద్ధి చేయడమే ఈ ప్రణాళిక ప్రత్యేకత. ప్రతి సమూహం పరిధిలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేసి ప్రాసెసింగ్ సంస్థలు, ఎగుమతిదారులు, రిటైల్ మార్కెట్లతో నేరుగా అనుసంధానిస్తారు. మామిడి పల్ప్, అరటి పౌడర్, చిప్స్, టమాటా ప్యూరీ, మిర్చి ఒలియోరెసిన్, డీహైడ్రేటెడ్ ఫ్రూట్స్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా తాజా పండ్ల మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గుల నుంచి రైతులను రక్షించే అవకాశం ఉంటుంది.

### అరటి ఎగుమతుల విజయం మనకు మార్గదర్శకం

ఆంధ్రప్రదేశ్ ఉద్యాన రంగంలో ఇప్పటికే సాధించిన అరటి ఎగుమతుల పురోగతి ఈ విధానానికి మంచి ఉదాహరణ. 2016--17లో కేవలం 246 టన్నులుగా ఉన్న అరటి ఎగుమతులు, క్లస్టర్ విధానం, ఎగుమతి సంస్థల భాగస్వామ్యం, నాణ్యతా ప్రమాణాలు, రవాణా సదుపాయాల అభివృద్ధితో అనంతపురం నుంచి ఇరాన్‌కు లక్ష టన్నులకు పైగా ఎగుమతి అయ్యే స్థాయికి చేరాయి. పండించిన రైతు ధర కోసం ఎదురు చూడకూడదు, మార్కెట్ రైతు వద్దకు రావాలి అనే నినాదంతో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది.

### రూ.81 వేల కోట్ల అదనపు స్థూల విలువ జోడింపు లక్ష్యం

ఈ సమగ్ర ప్రణాళిక ద్వారా మూడో సంవత్సరం నుంచి సుమారు రూ.81 వేల కోట్ల అదనపు స్థూల విలువ జోడింపును సాధించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఆధునిక సాగు పద్ధతులు, నాణ్యమైన మొక్కలు, సూక్ష్మ సాగునీరు ద్వారా ఉత్పాదకత పెంపు, గ్రేడింగ్--సార్టింగ్--బ్రాండింగ్ ద్వారా రైతుకు మెరుగైన ధర లభించేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ ప్రణాళిక ద్వారా సుమారు 19.7 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యం ప్రస్తావించబడింది.

### 'కరువు సీమ' నుంచి 'ఫ్రూట్ బౌల్' వైపు

మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, ఖర్జూరం, డ్రాగన్ ఫ్రూట్, పుచ్చకాయ, నిమ్మ, బత్తాయి, అవకాడోతో పాటు అధిక విలువ కలిగిన పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో రాయలసీమను దేశంలో ప్రత్యేక స్థానంలో నిలబెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నారు. ఒకప్పుడు కరువుకు ప్రతీకగా ఉన్న రాయలసీమను దేశపు పండ్ల గిన్నెగా, భవిష్యత్తులో ప్రపంచస్థాయి ఉద్యాన ఉత్పత్తి--ప్రాసెసింగ్--ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. రైతు ఆదాయం పెరగాలి.. గ్రామాల్లో ఉపాధి పెరగాలి.. మన పంటకు ప్రపంచ మార్కెట్ దక్కాలి అనే లక్ష్య సాధనకు ఈ సమగ్ర కార్యాచరణ దోహదపడనుంది.

# ఆసుపత్రికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందజేత



రాప్తాడు, మహి న్యూస్ అక్టోబర్ 01: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేద కుటుంబానికి చెందిన లబ్ధిదారుడి వద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందజేసిన ఘటన రాప్తాడు నియోజకవర్గంలో చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచనల మేరకు కొత్తగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా డయాలసిస్ చికిత్స పొందుతున్న దోశెట్టి రవితేజకు రూ.10 వేల పింఛన్‌ను అందజేశారు. అదేవిధంగా మరో నిరుపేద కుటుంబానికి చెందిన సంగప్పకు పింఛన్ అందించేందుకు సిబ్బంది ఇంటికి వెళ్లగా, ఆయన అనారోగ్యంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకున్నారు. దీంతో లబ్ధిదారుడి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ మొత్తాన్ని అందజేశారు. లబ్ధిదారుల ఇబ్బందులను గుర్తించి, పింఛన్ వారి వద్దకే చేరేలా చర్యలు తీసుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ రావూరి లక్ష్మీదేవి, కో-క్లస్టర్ ఇన్‌చార్జి భానుకోట రామాంజనేయులు, యూనిట్ ఇన్‌చార్జి కురుబ గోవిందరాజులు, మాజీ ఎంపీటీసీ బానుకోట లింగమయ్య, కో-యూనిట్ ఇన్‌చార్జిలు పేరం హరి, హాజీ మహమ్మద్ ఫిరోజ్, యూనిట్ ఇన్‌చార్జి మంగళ చిరంజీవి, బూత్ కన్వీనర్ తాడిపత్రి దస్తగిరి, రామన్న, వెల్ఫేర్ అసిస్టెంట్లు కే. రామాంజనేయులు, కార్తికతో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# టమోటా పంటను పరిశీలించిన మంత్రి పయ్యావుల కేశవ్

**రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై ఆరా**





అనంతపురం జిల్లా, అక్టోబర్ 1: (మహి న్యూస్): ఉరవకొండ నియోజకవర్గంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పర్యటించారు. కూడేరు మండలం ఎం.ఎం.హళ్లి గ్రామ సమీపంలో టమోటా పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట సాగు విధానం, దిగుబడి పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంట పొలాల్లో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, పని పరిస్థితులపై ఆరా తీశారు. రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

# ఉగాది నాటికి రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి

**అధికారులకు మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశం**

**జయపురం-ఎం.ఎం.హళ్లి మధ్య 4.50 కి.మీ రహదారికి భూమిపూజ**

**రూ.4.50 కోట్లతో రహదారి నిర్మాణం**

**ఎం.ఎం.హళ్లి సమీపంలో పూలవంకపై రూ.6.60 కోట్లతో వంతెన**




అనంతపురం, అక్టోబర్ 1: (మహి న్యూస్): కూడేరు మండలం జయపురం నుంచి ఎం.ఎం.హళ్లి గ్రామానికి నిర్మించనున్న రహదారి, ఎం.ఎం.హళ్లి సమీపంలోని పూలవంకపై నిర్మించనున్న వంతెన పనులను మంత్రి పయ్యావుల కేశవ్ భూమిపూజ చేసి ప్రారంభించారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన--4 కింద రూ.4.50 కోట్లతో 4.50 కిలోమీటర్ల రహదారి, రూ.6.60 కోట్లతో వంతెన నిర్మించనున్నారు. వచ్చే ఏడాది ఉగాది నాటికి రెండు పనులు పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు.

# ఓటర్ల జాబితా క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువు పొడిగింపు

**అక్టోబర్ 16న తుది ఓటర్ల జాబితా**

**క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిశీలనకు అక్టోబర్ 10 వరకు గడువు**

**నోటీసులు అందుకున్న వారి ఇళ్లకు వెళ్లి బీఎల్‌ఓలు విచారణ**

**ప్రత్యేక ప్రాంతాల్లో ఓటర్ల నమోదు కోసం శిబిరాలు**

**23,439 మందిపై క్షేత్రస్థాయి పునఃపరిశీలన**



అనంతపురం, అక్టోబర్ 1: (మహి న్యూస్): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిశీలన గడువును అక్టోబర్ 10 వరకు పొడిగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణను అక్టోబర్ 9 నుంచి 16వ తేదీకి మార్చినట్లు పేర్కొన్నారు. నోటీసులు అందుకుని హాజరు కాని వారి నివాసాలకు బీఎల్‌ఓలు వెళ్లి విచారణ నిర్వహించాలని సూచించారు. ప్రత్యేక పరిస్థితుల్లో ఆన్‌లైన్‌లో విచారణ చేపట్టవచ్చని తెలిపారు. నైట్ షెల్టర్లు, కార్మిక శిబిరాలు, నిరుపేదల కాలనీలు, నిరాశ్రయులు ఉండే ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లు, తొలిసారి ఓటు హక్కు పొందిన వారికి ప్రత్యేక నమోదు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతపురం జిల్లాలో అనర్హులుగా గుర్తించిన 23,439 మందిని మరోసారి క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించి, అర్హులైన వారిని ఓటర్ల జాబితాలో చేర్చాలని కలెక్టర్ తెలిపారు.

# పింఛన్ల పంపిణీతో పాటు అభివృద్ధి పనులకు భూమిపూజ

**రూ.73 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు**

**లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేసిన అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**

**ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవితో కలిసి కార్యక్రమాలు**

**మారుతి నగర్‌లో రూ.24.52 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ పనులు**

**విజేత మార్ట్ సమీపంలో రూ.48.39 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం**



అనంతపురం, అక్టోబర్ 1: (మహి న్యూస్): అనంతపురం నగరంలో ఒకవైపు పింఛన్ల పంపిణీ, మరోవైపు అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమాలు కొనసాగాయి. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవితో కలిసి రెండో రోడ్డు, మారుతి నగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. పింఛన్లు సకాలంలో అందుతున్నాయా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనే విషయాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మారుతి నగర్ 3వ క్రాస్‌లో రూ.24.52 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ పనులకు, విజేత మార్ట్ సమీపంలో రూ.48.39 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను కూడా వేగంగా చేపడుతున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. పింఛన్ల ద్వారా అర్హులైన పేదలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.



# మారుమూల ప్రాంతాలకూ రోడ్లు

**20 ఏళ్లుగా ఉన్న రోడ్ల సమస్యలకు పరిష్కారం: ఎమ్మెల్యే దగ్గుపాటి**

**పల్లె పండుగ 3.0తో గ్రామాల్లో పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం: ఎంపీ అంబికా**

**ఏ.నారాయణపురం పంచాయతీలో సీసీ రోడ్డుకు భూమిపూజ**

**పింఛన్లను ఇంటింటికీ పంపిణీ చేసిన ఎమ్మెల్యే, ఎంపీ**





అనంతపురం, అక్టోబర్ 1: (మహి న్యూస్): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మారుమూల ప్రాంతాల్లోనూ రోడ్ల నిర్మాణం జరుగుతోందని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. పల్లె పండుగ 3.0లో భాగంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి ఏ.నారాయణపురం పంచాయతీ ఏఎస్ఆర్ నగర్‌లో సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. రాయల్ నగర్‌లో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. రెండేళ్లలో రూ.1,300 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. పల్లె పండుగతో గ్రామాల్లో రోడ్లు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రాయలసీమ అభివృద్ధి, ఉద్యానరంగం, సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పల్లె పండుగ ద్వారా పెద్ద ఎత్తున గ్రామీణ రోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాల అభివృద్ధికి నిధులు తీసుకొస్తున్నట్లు తెలిపారు.

# వయోవృద్ధులకు గౌరవం, భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత

**వయోవృద్ధులకు పింఛన్లు పంపిణీ చేసిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ**

**శ్రీ వాసవీ వృద్ధాశ్రమాన్ని సందర్శించిన ఎంపీ**

**వృద్ధులతో ఆత్మీయంగా మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్న అంబికా**

**దాతల సహకారంతో బెడ్‌షీట్లు, వస్త్రాల పంపిణీ**






అనంతపురం, అక్టోబర్ 1: (మహి న్యూస్): అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా అనంతపురం రాజు రోడ్డులోని శ్రీ వాసవీ వృద్ధాశ్రమాన్ని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సందర్శించారు. వృద్ధులతో ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం వయోవృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. దాతల సహకారంతో వృద్ధాశ్రమంలోని వారికి బెడ్‌షీట్లు, వస్త్రాలు తదితర సామగ్రిని అందజేశారు. వయోవృద్ధులకు వైద్య సహాయం, ఇతర సేవలు అందిస్తున్న వృద్ధాశ్రమం పాలకవర్గం సేవలను ఎంపీ అభినందించారు. పెద్దల అనుభవం, ఆశీస్సులు సమాజానికి విలువైనవని, వారికి గౌరవం, ఆప్యాయత, భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం-2026

**వృద్ధుల హక్కులు, సంక్షేమంపై అవగాహన కార్యక్రమం**

**వృద్ధులకు గౌరవం, భద్రత, ఆరోగ్యం కల్పించాలి**

**ఉచిత న్యాయ సహాయం, సంక్షేమ పథకాలపై అవగాహన**

**బుక్కరాయసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం**





అనంతపురం, అక్టోబర్ 1: (మహి న్యూస్): అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం--2026 సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల, హిజ్రా మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుక్కరాయసముద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి ముఖ్య అతిథిగా పాల్గొని వృద్ధుల సంక్షేమం, గౌరవప్రదమైన జీవనం, హక్కుల పరిరక్షణపై మాట్లాడారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ వృద్ధుల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, తల్లిదండ్రులు మరియు వృద్ధ పౌరుల పోషణ, సంక్షేమ చట్టం--2007 ద్వారా కల్పిస్తున్న రక్షణలపై అవగాహన కల్పించారు. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి వృద్ధుల ఆరోగ్య పరిరక్షణ, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు వృద్ధుల సమస్యలు, అవసరాలను వివరించారు. వృద్ధుల సంక్షేమ పథకాలు, సీనియర్ సిటిజన్ గుర్తింపు కార్డులు, సహాయక ఉపకరణాలు, వైద్య సేవలు, నిర్వహణ న్యాయస్థానం తదితర సేవలపై అవగాహన కల్పించారు. సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు వృద్ధులు పాల్గొన్నారు.

# బూదిగుమ్మ బ్రిడ్జి పనుల్లో వేగం పెంచాలి

**నిర్దేశిత గడువులోగా నిర్మాణం పూర్తి చేయాలి: మంత్రి పయ్యావుల కేశవ్**

**బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి**

**నాణ్యత, వేగంపై అధికారులకు సూచనలు**

**వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు**





అనంతపురం, అక్టోబర్ 1: (మహి న్యూస్): బెళుగుప్ప మండలం బూదిగుమ్మ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. గురువారం బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించి పురోగతిని తెలుసుకున్నారు. వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పనులను ప్రణాళికాబద్ధంగా వేగవంతం చేయాలని సూచించారు. బ్రిడ్జి పూర్తయితే పరిసర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. పనుల్లో జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానికులు తెలిపిన సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# ఇంటింటికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

**లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి పయ్యావుల కేశవ్**

**ఎం.ఎం.హళ్లిలో లబ్ధిదారులకు నేరుగా పింఛన్ల అందజేత**

**అర్హులందరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యం**

**త్వరలో కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని వెల్లడి**





కూడేరు, అక్టోబర్ 1: (మహి న్యూస్): కూడేరు మండలం ఎం.ఎం.హళ్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్నామని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వారికి కొత్త పింఛన్లు కూడా మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

# బీసీల హక్కులతో రాజకీయాలు చేయొద్దులి - వల్లెపు నాగేష్



గాలివీడు:అక్టోబర్01(మహి న్యూస్ ): బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 105, 1065పై న్యాయపరమైన ప్రశ్నలు తలెత్తడం ఆందోళనకరమని గాలివీడు మండల వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు వల్లెపు నాగేష్ అన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటే అవసరమైన గణాంకాలు, చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసి, కోర్టులో నిలబడే విధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవోలు జారీ చేసి ప్రచారం చేసుకోవడం, అనంతరం న్యాయపరమైన చిక్కులు ఎదురైతే నిందను ఇతరులపై నెట్టడం సరికాదన్నారు. బీసీలకు కాగితపు హామీలు కాకుండా రాజ్యాంగబద్ధమైన, శాశ్వత హక్కులు కల్పించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ హయాంలో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమం, సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి, న్యాయపరమైన రక్షణ కల్పించాలని నాగేష్ డిమాండ్ చేశారు.

# గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌తో మదనపల్లికి ప్రపంచస్థాయి గుర్తింపు



మదనపల్లి, మహి న్యూస్, అక్టోబర్ 1: రాయలసీమ ప్రాంతాన్ని వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రపంచస్థాయి ఉద్యాన ఉత్పత్తుల కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపడుతున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ -- రాయలసీమ రైజింగ్ కార్యక్రమం మదనపల్లి ప్రాంత అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేయనుందని మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ భాష పేర్కొన్నారు. మదనపల్లి ఎన్వీఆర్ లేఅవుట్‌లోని మున్సిపల్ పార్కు వద్ద గురువారం సాయంత్రం నిర్వహించిన డ్రోన్ లేజర్ షోను ఎమ్మెల్యే షాజహాన్ భాష వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మదనపల్లి ప్రాంతానికి గ్లోబల్ హార్టికల్చర్ హబ్ వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమం రావడం ద్వారా వ్యవసాయ, ఉద్యాన రంగాలకు మరింత ప్రాధాన్యత లభించే అవకాశం ఉందన్నారు. మదనపల్లి ప్రాంతాన్ని ఉద్యాన పంటలకు అనుకూలమైన ప్రాంతంగా మరింత అభివృద్ధి చేయడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెటింగ్ వంటి అంశాలను అనుసంధానం చేయడం ద్వారా రైతులకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. హార్టికల్చర్ రంగం అభివృద్ధి చెందితే రైతులతో పాటు యువతకు ఉపాధి, వ్యాపార అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు. మదనపల్లికి జిల్లా హోదా కల్పించడం కూడా ప్రాంతీయ అభివృద్ధికి కీలకమైన అడుగుగా నిలిచిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల మదనపల్లి ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అన్నారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా రాబోయే రోజుల్లో మదనపల్లి, అన్నమయ్య జిల్లా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఉద్యాన పంటల విస్తరణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ మరియు పెట్టుబడులకు సంబంధించిన అవకాశాలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లలు, యువతకు కూడా భవిష్యత్తులో కొత్త అవకాశాలు ఏర్పడేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాయలసీమ ప్రాంతాన్ని వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో మరింత బలోపేతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేట్ పెట్టుబడిదారులు, రైతులు, వ్యవసాయ నిపుణులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఎం వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ....రాయలసీమ ప్రాంతాన్ని ప్రపంచస్థాయి ఉద్యానవన ఉత్పత్తుల కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ -- రాయలసీమ రైజింగ్ కార్యక్రమం ఉద్యాన రైతుల పాలిట వరంగా ఉంటుందని, ఈ ప్రాజెక్టు ఈ ప్రాంతంలో రావడం వల్ల అటు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## డ్రోన్ లేజర్ షోతో రాయలసీమ అభివృద్ధి దృశ్యాలు

గ్లోబల్ హార్టికల్చర్ హబ్ -- రాయలసీమ రైజింగ్ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన డ్రోన్ లేజర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాయలసీమలో వ్యవసాయ, ఉద్యాన రంగాల అభివృద్ధి, ఆధునిక సాగు విధానాలు, ఉద్యాన ఉత్పత్తుల విస్తరణ, రైతుల ఆదాయ అవకాశాలు, ప్రపంచస్థాయి హార్టికల్చర్ హబ్‌గా ప్రాంతం రూపుదిద్దుకునే భవిష్యత్ దృశ్యాలను డ్రోన్ కాంతుల విన్యాసాల ద్వారా ఆకాశంలో ఆవిష్కరించారు. డ్రోన్ షోను ఎమ్మెల్యే షాజహాన్ భాష వీక్షించి అభినందించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కార్యక్రమం ద్వారా మదనపల్లి ప్రాంతానికి అందుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని రైతులు, యువత, వ్యాపారవేత్తలు ముందుకు రావాలని ఎమ్మెల్యే షాజహాన్ భాష పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ ఏడి పురుషోత్తం, ఏపీఆర్ఓ హరినాథ్ నాయక్, ఎన్వీఆర్ లేఅవుట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుధాకర్, గార్డెన్ ఇంచార్జ్ శ్రీనివాస్, స్థానిక ప్రముఖులు ప్రజలు, పిల్లలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com


# విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

## స్కూల్ బస్సుల డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన



దుర్గి, అక్టోబర్ 1:(మహి న్యూస్): దుర్గి పోలీస్ స్టేషన్‌లో దుర్గి ఎస్ఐ బి. గోపాల్ ఆధ్వర్యంలో దుర్గి మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన స్కూల్ బస్సుల డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలు, సురక్షిత డ్రైవింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బి. గోపాల్ మాట్లాడుతూ స్కూల్ బస్సుల డ్రైవర్లు విధి నిర్వహణలో అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో పాటు వాహనం నడుపుతున్న సమయంలో సెల్‌ఫోన్ వినియోగం వంటి వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులను సురక్షితంగా పాఠశాలకు తీసుకెళ్లి, తిరిగి గమ్యస్థానాలకు చేర్చడం డ్రైవర్ల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. అలాగే ట్రాఫిక్, రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, సీటు బెల్ట్ వినియోగించాలని సూచించారు. బస్సుల్లో నిర్ణీత సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించుకోరాదని, వాహనాల ఫిట్‌నెస్‌తో పాటు ఇతర భద్రతా ప్రమాణాలను క్రమం తప్పకుండా పరిశీలించుకోవాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల నివారణకు ప్రతి డ్రైవర్ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్ఐ బి. గోపాల్ తెలిపారు. "విద్యార్థుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ ప్రమాదాలను నివారించాలి" అని ఎస్ఐ సూచించారు.

# అక్టోబర్ 2న స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్-2026

## 26 విభాగాల్లో అత్యుత్తమ స్వచ్ఛత కార్యక్రమాలకు పురస్కారాలు

### గుంటూరు కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ

### మూడు దశల్లో అవార్డుల ఎంపిక ప్రక్రియ

### 1,58,933 కేంద్రాల స్వీయ మూల్యాంకనం

### రాష్ట్ర స్థాయికి 101 ఎంట్రీలు ఎంపిక




గుంటూరు, అక్టోబర్ 1: (మహి న్యూస్): స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత రంగంలో విశేష కృషి చేసిన వారికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్--2026ను అక్టోబర్ 2న అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం, వ్యర్థాల తగ్గింపు--పునర్వినియోగం--పునరుత్పత్తి విధానాల్లో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. స్వీయ మూల్యాంకనం, జిల్లా స్థాయి ధృవీకరణ, మూడవ పక్షం మూల్యాంకనం మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. మొత్తం 1,58,933 కేంద్రాలు స్వీయ మూల్యాంకనంలో పాల్గొనగా, 1,960 నామినేషన్లు జిల్లా స్థాయిలో ఎంపికయ్యాయి. వీటిలో 101 ఎంట్రీలు రాష్ట్ర స్థాయి అవార్డులకు పోటీపడ్డాయి. జిల్లా స్థాయి విజేతలను అక్టోబర్ 2న మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ కార్యాలయంలోని శంకరన్ సమావేశ మందిరంలో సత్కరించనున్నారు. ప్రధాన అవార్డు విజేతలు: వడ్లమూడి, సీతారాంపురం, పొన్నెకల్లు, నందివెలుగు గ్రామ పంచాయతీలు; వెనిగండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల; తెనాలి, ప్రత్తిపాడు, కొల్లిపర తదితర ఆరోగ్య కేంద్రాలు; గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పరిషత్, అటవీ శాఖ కార్యాలయాలు; మంగళగిరి బస్‌స్టేషన్; తెనాలి రైతు బజార్; ఉండవల్లి గుహలు; కొండపనేని టౌన్షిప్ పార్క్; వెంకటపాలెం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం; హోటల్ వెంకటేష్ గ్రాండ్ తదితరాలు అవార్డులకు ఎంపికయ్యాయి. విజేతల పూర్తి వివరాలు స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

# డ్వాక్రా రుణంతో వ్యాపారం.. వాట్సాప్‌తో విస్తరణ

## మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి: సీఎం చంద్రబాబు

### రేపల్లెలో డ్వాక్రా మహిళ జేజమ్మతో ముఖ్యమంత్రి ముఖాముఖి

### రూ.2 లక్షల రుణంతో కిరాణా దుకాణం విస్తరణ

### వాట్సాప్ ద్వారా ఆర్డర్లు తీసుకుంటూ ఇంటికే సరుకుల పంపిణీ

### 'ఒక కుటుంబం-ఒక వ్యాపారవేత్త' స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచన




రేపల్లె, అక్టోబర్ 1: (మహి న్యూస్): స్వయం సహాయక సంఘాల ద్వారా లభించే రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. రేపల్లె 4వ వార్డులోని శ్రీలక్ష్మి కిరాణా జనరల్ స్టోర్‌ను సందర్శించి దుకాణం నిర్వహిస్తున్న జేజమ్మతో పాటు డ్వాక్రా మహిళలతో సీఎం ముఖాముఖి మాట్లాడారు. జేజమ్మ దంపతులు 2025లో రూ.1 లక్ష పెట్టుబడితో కిరాణా దుకాణాన్ని ప్రారంభించగా, అనంతరం రూ.2 లక్షల డ్వాక్రా రుణంతో వ్యాపారాన్ని విస్తరించారు. స్మార్ట్‌ఫోన్, వాట్సాప్ ద్వారా వినియోగదారుల నుంచి ఆర్డర్లు తీసుకుని ఇంటివద్దకే సరుకులు అందిస్తున్నట్లు జేజమ్మ సీఎంకు వివరించారు. వివిధ రంగాల్లో వ్యాపార అవకాశాలను అన్వేషించి స్వయం ఉపాధి దిశగా మహిళలు ముందుకు సాగాలని సీఎం సూచించారు. అనంతరం జేజమ్మ మామ వెంకటరావుకు వృద్ధాప్య పింఛన్‌ను ముఖ్యమంత్రి అందజేశారు.





# పని ప్రదేశాల్లో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించాలి

## పోష్ చట్టంపై ప్రతి ఉద్యోగికి అవగాహన అవసరం: రాయపాటి శైలజ

### ప్రతి సంస్థ మహిళల భద్రత, గౌరవానికి ప్రాధాన్యం ఇవ్వాలి

### అంతర్గత ఫిర్యాదుల కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలి

### వేధింపులపై మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలి



నరసరావుపేట, అక్టోబర్ 1: (మహి న్యూస్): కార్యాలయాల్లో మహిళలు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణంలో పనిచేసేలా చూడటం ప్రతి సంస్థ బాధ్యత అని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలోని గుర్రం జాషువా హాలులో నిర్వహించిన పోష్ చట్టం--2013 అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిష్కారానికి ఉద్దేశించిన పోష్ చట్టంపై ప్రతి ఉద్యోగికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేసి, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. లైంగిక వేధింపులపై షీ బాక్స్ పోర్టల్ ద్వారా ఫిర్యాదులను నమోదు చేసి పర్యవేక్షించవచ్చని శైలజ తెలిపారు. మహిళలు భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే మహిళా కమిషన్ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ అడ్వైజరీ సభ్యురాలు సూయజ్, జిల్లా రెవెన్యూ అధికారి అద్దయ్య, ఐసీడీఎస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.








# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు అప్పీల్

## రాయలసీమను గ్లోబల్ ఉద్యాన హబ్‌గా అభివృద్ధి చేస్తాం: సీఎం చంద్రబాబు

### బీసీలకు సామాజిక, రాజకీయ, ఆర్థికంగా అండగా ఉంటామని వెల్లడి

### సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత

### సూర్యలంకను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ప్రకటన

### రూ.1 లక్ష కోట్లతో రాయలసీమలో గ్లోబల్ ఉద్యాన హబ్‌కు ప్రణాళిక









రేపల్లె, అక్టోబర్ 1: (మహి న్యూస్): బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీల్ చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. బీసీల సామాజిక, రాజకీయ, ఆర్థిక అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రేపల్లెలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ అనంతరం ప్రజావేదికలో సీఎం మాట్లాడారు. గత 28 నెలలుగా ప్రతి నెలా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. పేదల జీవన ప్రమాణాలు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. పింఛన్ల కోసం ఇప్పటివరకు రూ.76 వేల కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాల పెంపునకు చర్యలు చేపడుతున్నామని సీఎం తెలిపారు. గత రెండేళ్లలో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగ అవకాశాలు వచ్చినట్లు పేర్కొన్నారు. రోడ్లు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాల అభివృద్ధికి మూలధన వ్యయం పెంచుతున్నామని చెప్పారు. రాయలసీమను గ్లోబల్ ఉద్యాన హబ్‌గా అభివృద్ధి చేసేందుకు రూ.1 లక్ష కోట్లతో ప్రకాశం జిల్లాతో కలిపి 10 జిల్లాల్లో ప్రణాళికలు అమలు చేయనున్నట్లు తెలిపారు. ఉద్యాన పంటలతో పాటు రవాణా, పర్యాటక రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహిస్తామన్నారు. బాపట్లలోని సూర్యలంక బీచ్‌ను గోవా తరహాలో అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. భూ సమస్యల పరిష్కారం, గృహ నిర్మాణం, వాట్సాప్ పాలన, ప్రజలకు మెరుగైన పౌర సేవలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యంతో రాష్ట్ర పునర్నిర్మాణం కొనసాగుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు.

# ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ మార్పు

## అక్టోబర్ 16న తుది ఓటర్ల జాబితా

### క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి అక్టోబర్ 10 వరకు గడువు

### నోటీసులు అందుకున్న వారి ఇళ్లకు వెళ్లి పత్రాలు సేకరించనున్న బీఎల్‌ఓలు

### అర్హులైన కొత్త ఓటర్లు నిరంతర నవీకరణ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు

గుంటూరు, అక్టోబర్ 1: (మహి న్యూస్): ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం సవరించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ అక్టోబర్ 10 వరకు కొనసాగనుండగా, అక్టోబర్ 16న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. మ్యాపింగ్ కాకపోవడం, తార్కిక వ్యత్యాసాలు తదితర కారణాలతో నోటీసులు అందుకున్న వారి ఇళ్లకు బూత్ స్థాయి అధికారులు వెళ్లి అవసరమైన పత్రాలను సేకరించి ఈసీఐనెట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. సాధారణంగా వారిని కార్యాలయానికి విచారణకు పిలవాల్సిన అవసరం లేదని తెలిపారు. రాత్రి ఆశ్రయ కేంద్రాల్లో నివసించే వారు, కార్మికులు, పేదలు, నిరాశ్రయుల కోసం హెల్ప్‌డెస్క్‌లు, ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్ఐఆర్‌లో పేరు నమోదు కాకపోయిన అర్హులు, యువత, తొలిసారి ఓటు హక్కు పొందుతున్న వారు నిరంతర నవీకరణ ప్రక్రియ ద్వారా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

# పల్నాడులో యువకుడి దారుణ హత్య



దాచేపల్లి, అక్టోబర్ 1 : ( మహి న్యూస్ ): పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురం నాయుడు బిల్డింగ్ సమీపంలో దారుణం చోటుచేసుకుంది. నల్లగొండకు చెందిన శ్రీనివాసరావు (32) అనే యువకుడిని గుర్తు తెలియని దుండగులు గురువారం హత్య చేశారు.స్థానికులు ఇచ్చిన సమాచారంతో దాచేపల్లి సీఐ షేక్ ఖాజావలి, ఎస్సై పాపారావు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం కూడా ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరిస్తోంది.హత్యకు గల కారణాలు, నిందితుల వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలి

## కొత్త జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బందికి కలెక్టర్ కృత్తికా శుక్ల ఆదేశం



### జిల్లా పరిషత్ భూములు, బడ్జెట్‌పై సమీక్ష

### నిధులతో చేపట్టాల్సిన పనులపై చర్చ

### సిబ్బంది కేటాయింపుపైనా సమీక్ష

నరసరావుపేట, అక్టోబర్ 1: (మహి న్యూస్): నరసరావుపేటలో కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లా పరిషత్ కార్యాలయానికి కేటాయించిన అధికారులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారి కృత్తికా శుక్ల ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా పరిషత్ అధికారులతో, సిబ్బందితో తొలి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా పరిషత్‌కు చెందిన భూముల వివరాలు, బడ్జెట్, నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సిబ్బంది కేటాయింపుపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ, డివిజనల్ స్థాయి అభివృద్ధి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజల వద్దకే సంక్షేమ ఫలాలు

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు: కలెక్టర్ కృతికా శుక్ల

### రెంటపాళ్లలో 'పేదల సేవలో 2.0' కార్యక్రమం

### లబ్ధిదారులకు ఉన్నతి, స్త్రీ నిధి, బ్యాంకు అనుసంధాన పత్రాల అందజేత

### రూ.26 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన

### గర్భిణులకు సీమంతం.. చిన్నారులతో ముచ్చటించిన కలెక్టర్

### 'పీ4' మార్గదర్శులకు సన్మానం




నరసరావుపేట, అక్టోబర్ 1: (మహి న్యూస్): సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో నిర్వహించిన 'పేదల సేవలో 2.0' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, లబ్ధిదారులకు వివిధ పథకాల మంజూరు పత్రాలను అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహించి, చిన్నారులతో ముచ్చటించారు. పల్లె పండుగ 3.0లో భాగంగా రూ.26 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసి, గోకులం షెడ్‌ను ప్రారంభించారు. 'పీ4' పథకం కింద సేవలందిస్తున్న మార్గదర్శులను సత్కరించారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ కృతికా శుక్ల తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నిరుపేదలకు రూ.4 వేల పింఛన్ అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేస్తూ సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ గోపాలకృష్ణ, డీఆర్డీఏ పీడీ ఝాన్సీరాణి, డీడీఓ ఉమాదేవి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు

## ప్రతి నెల 1వ తేదీనే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు పింఛన్ల పంపిణీ: కలెక్టర్ కృతికా శుక్ల

### రెంటపాళ్లలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

### బయోమెట్రిక్ సమస్యలకు ఫేషియల్ రికగ్నిషన్‌తో ప్రత్యామ్నాయం

### సాంకేతిక కారణాలతో పింఛన్ నిలిచిన వారు అధికారుల దృష్టికి తీసుకురావాలి



నరసరావుపేట, అక్టోబర్ 1: (మహి న్యూస్): సత్తెనపల్లి రూరల్ మండలం రెంటపాళ్ల గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. జిల్లావ్యాప్తంగా ప్రతి నెల 1వ తేదీ ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సిబ్బంది నేరుగా ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందిస్తున్నారని చెప్పారు. బయోమెట్రిక్ సమస్యలు ఎదురైతే ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా పంపిణీ పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ సాంకేతిక కారణాలతో పింఛన్ నిలిచిపోయిన వారు వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. పింఛన్ తీసుకున్న వృద్ధులు, దివ్యాంగుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ గోపాలకృష్ణ, డీఆర్డీఏ పీడీ ఝాన్సీరాణి, డీడీఓ ఉమాదేవి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# వృద్ధులు సమాజానికి మార్గదర్శకులు



కడప, అక్టోబర్ 01, (మహి న్యూస్): అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప గాంధీనగర్‌లోని నగరపాలక ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మెగా న్యాయ మాడ్యూల్ క్యాంప్ నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖలు స్టాళ్లను ఏర్పాటు చేసి వృద్ధుల సంక్షేమం, హక్కులు, ప్రభుత్వ సేవలపై అవగాహన కల్పించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్ మాట్లాడుతూ వృద్ధులు సమాజానికి మార్గదర్శకులని, వారి అనుభవాలు భావితరాలకు ఆదర్శమని అన్నారు. వృద్ధుల హక్కులను గౌరవించి, వారికి ప్రేమ, ఆదరణ, రక్షణ కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, వృద్ధులు చేసిన త్యాగాలను ఎప్పటికీ మరువరాదన్నారు. వృద్ధులను కుటుంబానికి మూలస్తంభాలుగా భావించి ప్రేమతో చూసుకోవాలని సూచించారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో మానవ విలువలు, పెద్దల పట్ల గౌరవభావాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం, న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత సేవలు, చట్టపరమైన రక్షణపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్, ఆర్డీవో ఎ. మురళి, వికలాంగుల శాఖ ఏడీ ఆర్.వి. కృష్ణ కిషోర్, డీఎస్పీ ఇ. బాలస్వామి రెడ్డి, సీఐ పి. తిమ్మారెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, డీఈఓ ఎస్. షంషుద్దీన్, మున్సిపల్ కమిషనర్ పి. భవాని ప్రసాద్, తహసీల్దార్ ఎస్. మహబూబ్ చాంద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, వృద్ధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# అన్నమయ్య జిల్లా విద్యా, పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి

## పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న




మదనపల్లె, మహిన్యూస్, అక్టోబర్ 01: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మదనపల్లె పర్యటన సందర్భంగా అన్నమయ్య జిల్లాలో విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, విద్యా, పారిశ్రామిక, రవాణా రంగాల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న కోరారు. మదనపల్లె బీటీ కళాశాలను ప్రభుత్వ విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చేయాలని, తంబళ్లపల్లెలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, మదనపల్లె, రాయచోటిలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలలు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. మదనపల్లె ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. రాయచోటిలో 2021లో ఏర్పాటు చేసిన పీజీ కేంద్రంలో పూర్తిస్థాయిలో తరగతులు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, పీజీ కోర్సులు, అధ్యాపకులు, శాశ్వత భవనాలు, హాస్టల్, డిజిటల్ లైబ్రరీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. రాయచోటి పీజీ కేంద్రాన్ని పూర్తిస్థాయి విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చేసి, ఈ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయాలని విజ్ఞప్తి చేశారు. కడప--బెంగళూరు రైల్వే లైన్‌కు అవసరమైన అనుమతులు మంజూరు చేసి, నిర్మాణ పనులను ప్రారంభించాలని అంకన్న కోరారు. జిల్లాలో విద్యా, ఉపాధి అవకాశాల విస్తరణకు అవసరమైన నిధులు కేటాయించి, అభివృద్ధి పనులను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

# మొగిలి ఆలయ అభివృద్ధిని అన్ని విధాల ముందుకు తీసుకెళతాం

## - నూతన చైర్మన్ కమల్నాథరెడ్డి.

## మొదటగా రెండు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు.



చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం అక్టోబర్ 1.: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం మొగిలి గ్రామానికి చెందిన శివాలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని నూతనంగా ఎన్నికైన చైర్మన్ కమల్నాథరెడ్డి గురువారం మొగిలిలో జరిగిన నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సమావేశంలో తెలియజేశారు. గత ఎన్నో సంవత్సరాలుగా మొగిలి ఆలయానికి ఒక చరిత్ర ఉందని, కాణిపాకం ఆలయానికన్నా అభివృద్ధి కావాల్సిన మొగిలి శివాలయం వెనుకబడి ఉండటాన్ని తాము జీర్ణించుకోలేకపోయామని జమీందారీ వంశపార్యపరంలో నడుస్తున్న ఈ ఆలయం వెనుకబడి ఉండడాన్ని గమనించి ఈ విషయాన్ని మండల టిడిపి నాయకులకు తెలుపుగా, వారు పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ తో తెలిపి ఆయన ద్వారా ఆలయ అభివృద్ధికి ఒక కమిటీని ఎనిమిది మందితో ఈరోజు నిర్వహించడం జరిగిందని మొగిలి ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని భక్తులు విరివిగా శివాలయానికి వచ్చి తమ మ్రొక్కుబడులను తీర్చుకొని ఆలయ అభివృద్ధికి సహకరించాలని నూతన చైర్మన్ కమల్నాదరెడ్డి తెలిపారు. ఇంతవరకు అన్ని ఆలయాల్లో కమిటీలు ఉన్న మొగిలి ఆలయానికి నూతన కమిటీ ద్వారా త్వరలోనే అభివృద్ధి పనులు చేసి నిరూపిస్తామని చైర్మన్ కమల్నాద రెడ్డి, మిగతా డైరెక్టర్లుగా ఉన్న ఏడు మంది తెలిపారు. డైరెక్టర్లుగా ప్రమాణం చేసిన వారిలో పి. గీత, బి. కే. త్రివేణి, ఎం.కనకదుర్గ, ఎల్. సంజీవి, ఎన్. జమున, ఏ. హేమచంద్ర నాయుడు, కె. శ్రీనివాసులు ఉన్నారు. కార్యక్రమంలో మొగిలి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబి విజయకుమార్, ఈవో మునిరాజులు, సిబ్బంది శరవణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ మురళీమోహన్, చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు సతీమణి సి కె లావణ్య, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తండ్రి చెన్నకేశవులు నాయుడు, బంగారుపాలెం మండలం తెలుగుదేశం పార్టీ గౌరవాధ్యక్షులు ఎన్ పీ జయప్రకాష్ నాయుడు, మండల అధ్యక్షులు ధరణి నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జై చంద్ర నాయుడు, జి ఆర్ కన్స్ట్రక్షన్ అధినేత ఈశ్వర్ నాయుడు, మండల కార్యదర్శి జనార్దన్ గౌడ్, కోదండ యాదవ్, సూరి నాయుడు, మాధవ నాయుడు, ప్రకాష్ నాయుడు, కొండేటి శివ, తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, కార్యక్రమంలో పాల్గొన్నారు.





# లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ల పంపిణీ..



చిత్తూరు, మహి న్యూస్, అక్టోబర్ 1 : పూతలపట్టు నియోజకవర్గం లోని మాధవరం పంచాయతీ స్వస్తిక్ నగర్ లో ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్లను పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు. గురువారంప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పథకం కింద సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పాల్గొని, లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగ కలెక్టర్ లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నెలనెలా పెన్షన్లను పంపిణీ చేస్తున్నారా, ఎవరైనా డబ్బులు అడిగారా అంటూ ఆరా తీశారు. పెన్షన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి రూ.10.50 లక్షల విరాళం అందజేసిన చిత్తూరు జిల్లా పండ్ల పరిశ్రమల సమాఖ్య

## సమాఖ్య ప్రతినిధులను అభినందించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు, మహి న్యూస్, అక్టోబర్ 1: చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆధునీకరణ, మౌలిక వసతుల కల్పనలో భాగంగా చిత్తూరు జిల్లా పండ్ల పరిశ్రమల సమాఖ్య ప్రతినిధులు గురువారం కలెక్టరేట్లోని నాగార్జున ఐఏఎస్ వీడియో కన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కోసం రూ.10,50,000 (పది లక్షల యాభై వేల రూపాయలు) విలువైన చెక్కును జిల్లా కలెక్టర్కు అందజేశారు. ఈ నిధులను ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్రసూతి (మెటర్నిటీ) మరియు ఆర్థోపెడిక్ విభాగాల ఆధునీకరణతో పాటు అవసరమైన వైద్య పరికరాల సమకూర్పునకు వినియోగించనున్నట్లు సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. సామాజిక బాధ్యతతో (సీఎస్ఆర్) ముందుకు వచ్చి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి సహకరించిన పండ్ల పరిశ్రమల సమాఖ్య ప్రతినిధులను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల ప్రతినిధులు రఘురాం చౌదరి, కట్టమంచి బాబి, సిద్ధార్థ, మనోహర్, సుదర్శన్, చంద్రమోహన్, ఈశ్వర్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

# తవణంపల్లి మండలం మాధవరం స్వర్ణ గ్రామం స్వస్తిక్ నగర్ ఎస్టి కాలనీ నందు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఆకస్మికంగా పర్యవేక్షించిన జిల్లా మెజిస్ట్రేట్ మరియు కలెక్టర్ సుమిత్ కుమార్

తవణంపల్లి, మహి న్యూస్, అక్టోబర్ 1: ఈ కార్యక్రమంలో తవణంపల్లి మండలం స్పెషల్ ఆఫీసర్ మరియు సమగ్ర శిక్ష ఏపీసి మద్దిపట్ల వెంకటరమణ మండల తహసిల్దారు మండల రెవెన్యూ అధికారి పాల్గొన్నారు . ఈ సందర్భంగా కలెక్టర్ గారు స్వస్తిక్ నగర్ ఎస్టి కాలనీ గ్రామ ప్రజలకు హామీలు ఇచ్చారు 1)స్వస్తిక్ నగర్ ఎస్టి కాలనీ నందలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి పనులకు పదివేల రూపాయల కేటాయింపు . 2)స్వస్తిక్ నగర్ ఎస్టి కాలనీ నందుగల స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణానికి వీబీజీఆర్ఏఎంజీ నిధులు మంజూరు చేయడం 4)స్వస్తిక్ నగర్ ఎస్టి కాలనీ నందు అంగన్వాడీ కేంద్రం ప్రహరీ గోడ నిర్మాణానికి వీబీజీఆర్ఏఎంజీ నిధులు 5) స్వస్తిక్ నగర్ ఎస్టి కాలనీ నందు ఆవులయ్య ఇంటి పరిసరాలు యందు రివేట్ మెంట్ పనులకు వీబీజీఆర్ఏఎంజీ నిధుల మంజూరు 6) శ్రీమతి రాణి వారికి వితంతు పెన్షన్ మూడు నెలలపాటు నెలకు 4000 రూపాయలు చొప్పున మొత్తం 12,000 రూపాయలు శ్రీయుత జిల్లా కలెక్టర్ గారు మంజూరు చేయడం జరిగింది 7)గృహములు లేనివారికి స్థలములు కేటాయించవలసిందిగా తహసిల్దారు వారికి తెలియజేశారు . 8)ప్రభుత్వ బోరు నుండి పైపులు వేయుటకు నాలుగు లక్షల రూపాయలు కేటాయింపు.

# స్వచ్ఛాంధ్ర అవార్డ్స్-2026 జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవం

## అక్టోబర్ 2న చిత్తూరులో నిర్వహణ

చిత్తూరు, మహి న్యూస్, అక్టోబర్ 1: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర (సస) కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛాంధ్ర అవార్డ్స్--2026 జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని అక్టోబర్ 2న నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు

**- అక్టోబర్ 2, 2026న జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవం**

**-సాయంత్రం 4.00 గంటలకు కార్యక్రమం**

**-జిల్లా ప్రజా పరిషత్ సమావేశ భవనం, చిత్తూరులో నిర్వహణ**

పారిశుద్ధ్య నిర్వహణ, ప్లాస్టిక్ కాలుష్య నివారణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ, ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) కార్యకలాపాలు, స్థిరమైన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు రాష్ట్రవ్యాప్తంగా పారిశుద్ధ్య రంగంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారిని గుర్తించి, ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర అవార్డ్స్--2026ను అందిస్తోంది. ఇందులో భాగంగా 2026 ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 28 వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కాలంలో చేపట్టిన పారిశుద్ధ్య కార్యకలాపాల పనితీరు, వాటి మూల్యాంకనం ఆధారంగా అవార్డు విజేతలను ఎంపిక చేశారు. పారిశుద్ధ్య రంగంలో ప్రశంసనీయమైన సేవలు, అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఎంపికైన విజేతలకు జిల్లా స్థాయి అవార్డులు అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛమైన, పచ్చదనంతో కూడిన, సుస్థిరమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి చేపడుతున్న కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ, ఎంపికైన అవార్డు విజేతలు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పై ప్రకటనలో తెలిపారు.

# వైభవంగా ప్రారంభమైన వెంకటగిరి శ్రీ పోలేరమ్మ జాతర మహోత్సవం

## ప్రభుత్వ లాంఛనాలతో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

## జాతర నిర్వహణకు రూ.50 లక్షలు మంజూరు; తొలి విడతగా రూ.40 లక్షలు విడుదల

## ఆలయ నిధుల్లో రూ.1.70 కోట్ల ఫిక్స్డ్ డిపాజిట్, ఎస్బీఐ ఖాతాలో రూ.25 లక్షల నిల్వ

వెంకటగిరి/తిరుపతి, అక్టోబర్ 1,మహి న్యూస్: తిరుపతి జిల్లా వెంకటగిరిలో శ్రీ పోలేరమ్మ తల్లి జాతర మహోత్సవం గురువారం శాస్త్రోక్తంగా, వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన ఈ జాతర సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి ఆనం



రామనారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు



తెలిపారు. రాష్ట్ర పండుగల నిర్వహణకు ప్రభుత్వం ఏటా రూ.50 లక్షల వరకు నిధులు కేటాయిస్తోందని పేర్కొన్నారు. అందులో భాగంగా పోలేరమ్మ జాతరకు రూ.50 లక్షలు మంజూరు చేసి, తొలి విడతగా రూ.40 లక్షలు విడుదల చేసినట్లు వెల్లడించారు. జాతర వ్యయ వివరాలు అందిన వెంటనే మిగిలిన రూ.10 లక్షలు విడుదల చేస్తామన్నారు. భక్తులు, దాతల సహకారంతో ఆలయానికి స్వర్ణాభరణాలు సమకూరాయని, ప్రస్తుతం ఆలయానికి రూ.1.70 కోట్ల ఎఫ్డీతో పాటు బ్యాంకు ఖాతాలో రూ.25 లక్షల నిధులు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు.

**నియోజకవర్గ పరిధిలోని దేవాలయాల అభివృద్ధి వివరాలను మంత్రి వెల్లడించారు:**

వెంకటగిరి నియోజకవర్గంలోని నాలుగు ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకం కింద ఏటా రూ.4.80 లక్షల కేటాయింపు.

మూడు ప్రధాన ఆలయాల అభివృద్ధి పనులకు రూ.7.05 కోట్లు మంజూరు.

శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 13 నూతన ఆలయాల నిర్మాణానికి రూ.4.60 కోట్లు కేటాయింపు.

రాపూరు మండలంలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అనుసంధానంతో అటవీ ప్రాంతంలోని శ్రీ చెంచులక్ష్మి అమ్మవారి ఆలయ పరిసరాల్లో మౌలిక వసతుల కల్పన.

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి, రాజధాని అమరావతి నిర్మాణ పనుల సత్వర పూర్తికి అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూ లైన్లలో ప్రత్యేక షెడ్లు, ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ జాతరకు విచ్చేసే ప్రతి భక్తుడికీ సౌకర్యవంతమైన, సురక్షితమైన దర్శనం కల్పించడమే



యంత్రాంగం లక్ష్యమని స్పష్టం చేశారు. పోలీస్, రెవెన్యూ, దేవాదాయ, పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్యారోగ్య శాఖల సమన్వయంతో తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య శిబిరాలు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ మహేశ్వర రెడ్డి, పోలేరమ్మ దేవస్థానం ప్రత్యేక అధికారి విజయ రాజు, జిల్లా ఎండోమెంట్ అధికారి రామకృష్ణ, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, ఆలయ చైర్మన్ మురళీకృష్ణ, తహసీల్దార్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

## అధికారుల సమన్వయంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు

## క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరాయంగా పర్యవేక్షణ

తిరుమల ,అక్టోబర్ 1,మహి న్యూస్: పెరటాసి మాసంతో పాటు వరుస సెలవులు నేపథ్యంలో తిరుమలకు భక్తులు పోటెత్తారు. ఈ నేపథ్యంలో టీటీడీ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరాయంగా సేవలు అందిస్తోంది. వైకుంఠ క్యూ కాంప్లెక్స్ -



1,2, నారాయణగిరి షెడ్లు, అక్టోపస్ సర్కిల్ వరకు బయట క్యూలైన్లలో భక్తులకు అందుతున్న సౌకర్యాలను వివిధ విభాగాల



అధికారులు సమన్వయంతో అనునిత్యం పర్యవేక్షిస్తూ భక్తులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. అన్న ప్రసాదం విభాగం, ఆరోగ్య విభాగం, శ్రీవారి సేవా విభాగం, విజిలెన్స్ సిబ్బంది క్యూలైన్లలో భక్తులకు అందుతున్న సౌకర్యాలను నిరంతరాయంగా పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు టీటీడీ ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో క్యూలైన్లలో మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పరిశుభ్రతకు పెద్ద పీట వేస్తున్నారు. అదేవిధంగా చెత్త పేరుకుపోకుండా నిమిషాల వ్యవధిలో చెత్తను తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు పారిశుద్ధ్య సిబ్బంది విశేష కృషి చేస్తున్నారు. కాగా, శ్రీవారి సేవకులు భక్తుల రద్దీ క్రమబద్ధీకరణకు, టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలను భక్తులకు నిరంతరాయంగా అందిస్తున్నారు. క్యూలైన్లలో భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా అన్న ప్రసాదాలు, టీ, కాఫీ, పాలు, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేస్తున్నారు. అన్న ప్రసాద విభాగం సిబ్బంది అన్న ప్రసాదాలను ఎప్పటికప్పుడు వాహనాల్లో క్యూలైన్ల



వద్దకు తరలించడం జరుగుతోంది. టీటీడీ విజిలెన్స్ విభాగం ఎప్పటికప్పుడు భక్తుల రద్దీని అంచనా వేస్తూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా భక్తులు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. అదేవిధంగా వైద్య విభాగం ఆధ్వర్యంలో మొబైల్ క్లీనిక్ నిరంతరాయంగా తిరుగుతూ అవసరమైన భక్తులకు వైద్య సహాయం అందించడం జరుగుతోంది. ఇదివరకే భక్తుల అధిక రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎక్కువ మంది సర్వదర్శనం భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించేందుకు అక్టోబర్ 1వ తేదిన వీఐపీ బ్రేక్ దర్శనాలను కూడా టీటీడీ రద్దు చేసిన విషయం విదితమే. టీటీడీ అధికారులు, సిబ్బంది, దర్శన క్యూలైన్లను నిరంతరాయంగా పర్యవేక్షిస్తూ రాత్రింబవళ్లు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శ్రమిస్తున్నారు.

# వృద్ధులు సమాజానికి దిక్సూచి: తిరుపతి అర్బన్ డీఎస్పీ భక్తవత్సలం

## రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని వృద్ధులకు పోలీసుల పిలుపు

## 25 మంది లబ్ధిదారులకు ఉపకరణాలు, నిత్యావసర వస్తువుల పంపిణీ

తిరుపతి, అక్టోబర్ 1,మహి న్యూస్: వృద్ధులు సమాజానికి దిక్సూచి లాంటివారని, వారి విస్తృత జీవిత అనుభవాలు



కుటుంబాలకు ఎంతో మేలు చేస్తాయని తిరుపతి అర్బన్ డీఎస్పీ భక్తవత్సలం పేర్కొన్నారు. రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ఆధ్వర్యంలో అన్నమయ్య మార్గ్లోని రాస్ నిలయంలో నిర్వహించిన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై



మాట్లాడారు. ప్రస్తుత కాలంలో వయోవృద్ధుల సంక్షేమం, రక్షణ కోసం భారత ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను అమల్లోకి తెచ్చిందని డీఎస్పీ తెలిపారు. ఓటీపీల పేరుతో ఫోన్ కాల్స్ చేస్తూ ఆర్థిక నేరాలకు పాల్పడే సైబర్ కేటుగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత వివరాలను ఎవరికీ చెప్పవద్దని సూచించారు. కుటుంబాలలో ఆవేశాలకు, కోపతాపాలకు దూరంగా ప్రశాంత జీవనం సాగించాలని పిలుపునిచ్చారు. వృద్ధులకు ఏదైనా అన్యాయం లేదా ఇబ్బంది ఎదురైనప్పుడు టోల్ ఫ్రీ నంబర్ ద్వారా క్షణాల వ్యవధిలోనే పోలీస్ సహాయం అందుతుందని స్పష్టం చేశారు. న్యూ బాలాజీ కాలనీ యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా వృద్ధులకు రాస్ సంస్థ అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. స్వయం సహాయక సంఘాల ద్వారా పొందిన రుణాలతో పిల్లలకు వ్యాపారాలు ఏర్పాటు చేసి క్రమశిక్షణతో కూడిన ఆర్థిక ప్రగతిని సాధిస్తున్నారని ప్రశంసించారు.





**కార్యక్రమంలోని ముఖ్యాంశాలు:**

**భారీ హాజరు:**

తిరుపతి, మంగళం, ఏర్పేడు, పాపానాయుడుపేట గ్రామాల నుంచి సుమారు 250 మంది వృద్ధులు ఈ వేడుకకు తరలివచ్చారు.

**ఉపకరణాల అందజేత:**

25 మంది వృద్ధులకు చేతికర్రలు, వినికిడి యంత్రాలు, వీల్చైర్లు, దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశారు.

**సాంస్కృతిక ప్రదర్శనలు:**

వృద్ధులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాస్ పొదుపు సంఘాల ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజు, ప్రతినిధులు బాలాజీ రెడ్డి,రవి,నాగేశ్వర్,గిరి,కుమార్, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ పాఠశాలలో ఉత్సాహంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్.

## విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీయాలి.

చిత్తూరు అక్టోబర్ 1.మహి న్యూస్:: చిత్తూరు పట్టణం గిరింపేటలోని నారాయణ పాఠశాలలో విద్యార్థి ఆధ్వర్యంలోని సమావేశం( స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఎస్ ఎల్ సి ) గిరింపేట లోని ఇకిడ్స్ ఇచాంప్స్ విభాగంలో ఎంత విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ తల్లిదండ్రులతోపాటు హాజరయ్యారు. విద్యార్థులు తరగతిలో ఇప్పటివరకు నేర్చుకున్న పాఠ్యాంశాలు తమ అభ్యాసం కార్యకలాపాలు వివిధ నైపుణ్యాలను తల్లిదండ్రులకు స్వయంగా వివరించారు. కార్యక్రమం అనంతరం తల్లిదండ్రులు తమ పిల్లల ప్రదర్శన పై సానుకూలమైన ప్రసంసనీయమైన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసం మాట్లాడే నైపుణ్యం విషయ పరిజ్ఞానం తమ అభ్యాసాన్ని స్వయంగా వివరించే సామర్థ్యం అభివృద్ధి చెందుతున్నాయని వారు అభినందించారు. చిన్నారులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వివిధ కార్యకలాపాల ద్వారా బోధన అందించాలని డీజీఎం కొండలరావు ఏబీఎన్ రవీంద్ర ఫణికుమార్ ఆర్ ఐ జెల్ఫీషేక్ అన్నారు. బుధవారం గిరింపేటలోని నారాయణ పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జూమ్ మీటింగ్ ద్వారా నారాయణ పాఠశాల డైరెక్టర్ రమ, చామ్స్ ఆర్ అండ్ డి హెడ్ నీలిమ, కిడ్స్ ఆరండి హెడ్ అరబి, ప్రిన్సిపల్ వేదవతి, కోఆర్డినేటర్లు శ్వేత, అశ్విని,ఇకిడ్స్ ఇచాంప్స్ వైస్ ప్రిన్సిపల్ సంబంధిత ఉపాధ్యాయులందరూ పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం తమ విలువైన సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అతిధులు, పాఠశాల యాజమాన్యం, సమన్వయకర్తలు వైస్ ప్రిన్సిపల్స్ ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులందరికీ నారాయణ స్కూల్ ఇకిడ్స్ అండ్ ఇచాంప్స్ చిత్తూరు సి హెచ్ ఆర్, జిఎంపి తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు





RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

# యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



కర్నూలు, అక్టోబర్ 1: (మహి న్యూస్): యువత తమ అభిరుచి, సామర్థ్యాలకు అనుగుణంగా లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దుపాడులోని అశోక మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ--సెట్కూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా యువజనోత్సవాలను కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రారంభించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. యువజనోత్సవాలు యువతలోని ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదపడతాయని తెలిపారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లాలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలు, నైపుణ్య శిక్షణలను యువత వినియోగించుకోవాలని కోరారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ.. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం, ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను మొమెంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో సెట్కూర్ సీఈఓ వేణుగోపాల్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దీప్తి, అధికారులు, కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులు పాల్గొన్నారు.



# గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌పై విస్తృత అవగాహన

## ప్రచార రథాన్ని ప్రారంభించిన కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



కర్నూలు, అక్టోబర్ 1: (మహి న్యూస్): కర్నూలు జిల్లాను ఉద్యాన పంటల అభివృద్ధికి కీలక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన "గ్లోబల్ హార్టికల్చర్ హబ్--రాయలసీమ రైజింగ్" కార్యక్రమంపై రైతులు, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సూచించారు. కలెక్టరేట్ ప్రాంగణం నుంచి ప్రచార రథాన్ని గురువారం కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అక్టోబర్ 1 నుంచి 10వ తేదీ వరకు జిల్లాలోని 22 గ్రామాల్లో ప్రచార రథం ద్వారా రైతులకు ఉద్యాన పంటల సాగు, పంటల వైవిధ్యీకరణ, ఆధునిక సాగు పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాలు, సాంకేతిక సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. రైతులు, యువత, ప్రజలు ఈ అవగాహన కార్యక్రమాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, సమాచార శాఖ ఉపసంచాలకులు జయమ్మ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కర్నూలులో మంత్రి టీజీ భరత్ పింఛన్ల పంపిణీ

## సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత




కర్నూలు, అక్టోబర్ 1: (మహి న్యూస్): బిర్లా గేట్ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి టీజీ భరత్ అనంతరం 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వెల్లడి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని వ్యాఖ్య ఫ్రీ బస్సు, అన్న క్యాంటీన్లు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఎన్టీఆర్ వైద్య సేవలు అందిస్తున్నామని వెల్లడి కర్నూలు జిల్లాలో సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడులకు క్యాబినెట్ ఆమోదం పొందిందని వెల్లడి కర్నూలును విమాన శిక్షణ సంస్థలు, డ్రోన్ రంగాలకు కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి ప్రకటన గడియారం ఆసుపత్రి అభివృద్ధితో పాటు నగరంలో అన్ని రంగాల అభివృద్ధికి చర్యలు కర్నూలు నగర అభివృద్ధిలో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తామని మంత్రి టీజీ భరత్ తెలిపారు



# అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

**చిన్నారులతో ముచ్చటించి చదువు, ఆరోగ్యం, ఆహారంపై ఆరా**

**పోలూరు అంగన్‌వాడీ కేంద్రం-1ను సందర్శించిన నంద్యాల కలెక్టర్ రాజకుమారి గణియా**

**చిన్నారుల అభ్యసన సామర్థ్యం, చురుకుదనాన్ని పరిశీలన**

**పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య సేవలపై ఆరా**



నంద్యాల, అక్టోబర్ 1: (మహి న్యూస్): నంద్యాల మండలం పోలూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం--1ను జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సందర్శించారు. చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించి వారి చదువు, ఆటలు, ఆరోగ్యం, ఆహారపు అలవాట్లను తెలుసుకున్నారు. అంగన్‌వాడీ ద్వారా అందుతున్న పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌పై విస్తృత అవగాహన

**కళాజాత ప్రచార రథాన్ని పరిశీలించిన కలెక్టర్ రాజకుమారి గణియా**

**20 గ్రామాల్లో కళాజాత ద్వారా అవగాహన కార్యక్రమాలు**

**రైతులు, యువత, మహిళలకు ఆధునిక ఉద్యాన సాగుపై అవగాహన**

**మార్కెటింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఎగుమతుల అవకాశాలపై ప్రచారం**



నంద్యాల, అక్టోబర్ 1: (మహి న్యూస్): 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్--రాయలసీమ రైజింగ్' కార్యక్రమంపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సూచించారు. కార్యక్రమ ప్రచారం కోసం ఏర్పాటు చేసిన కళాజాత ప్రచార రథాన్ని గురువారం ఆమె పరిశీలించారు. నంద్యాల జిల్లాలోని 20 గ్రామాల్లో కళాజాత బృందం పర్యటించి ఉద్యాన రంగ అభివృద్ధి, ఆధునిక సాగు విధానాలు, మార్కెటింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఎగుమతుల అవకాశాలపై ప్రజలకు అవగాహన కల్పించనుంది. రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా సందేశాన్ని చేరవేయాలని కలెక్టర్ కళాకారులకు సూచించారు.



# వృద్ధుల హక్కుల పరిరక్షణకు చట్టాలు

## సమస్యలు ఎదురైతే ఉచిత న్యాయ సహాయం పొందాలి

కర్నూలు, అక్టోబర్ 1: (మహి న్యూస్): ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు ఏ.క్యాంప్‌లోని ఇందిరాగాంధీ మెమోరియల్ హైస్కూల్‌లో సీనియర్ సిటిజన్ల కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఏఓ శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ.. ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు ప్రతి ఏడాది అక్టోబర్ 1న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా స్థిరంగా ఉన్న వృద్ధులు సైతం కుటుంబ నిర్లక్ష్యం, పిల్లల ఆదరణ లేకపోవడం, ఆస్తుల కోసం వేధింపులు, శారీరక దాడులు వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వృద్ధుల సంక్షేమం కోసం అనేక చట్టాలు, పథకాలు అందుబాటులో




ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, భరణం మరియు సంక్షేమ చట్టం--2007 ప్రకారం వృద్ధులకు భరణం పొందే హక్కు ఉందని, పోషణ బాధ్యతను విస్మరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని వివరించారు. సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రయిస్ ఫాతిమా మాట్లాడుతూ.. వృద్ధుల ఆస్తిని తీసుకుని అనంతరం వారిని నిర్లక్ష్యం చేసే వారసులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. న్యాయ సమస్యలు ఎదురైతే జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని లీగల్ ఎయిడ్ సభ్యుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. వృద్ధులు తమ సమస్యల పరిష్కారం కోసం 15100 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని చెప్పారు. అనంతరం వృద్ధులకు సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బెడ్‌షీట్లను అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ సహకారంతో వృద్ధుల భరణ, పోషణ, సంక్షేమ చట్టం--2007పై



రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఏఓ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోజా, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి రంగనాయక్, కోశాధికారి డాక్టర్ ప్రభాకర్‌రావు, వృద్ధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వృద్ధుల సంక్షేమానికి చట్టపరమైన రక్షణ

## సమస్యలు ఎదురైతే ఉచిత న్యాయ సహాయం పొందాలి

కర్నూలు, అక్టోబర్ 1: (మహి న్యూస్): అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు బి.క్యాంప్‌లోని మన వృద్ధుల ఆశ్రమంలో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ పి. వాసు ఆధ్వర్యంలో జరిగిన



కార్యక్రమంలో కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి, లీగల్ ఎయిడ్ సభ్యుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, న్యాయవాది పాపారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి పి. వాసు మాట్లాడుతూ.. ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు ప్రతి ఏడాది అక్టోబర్ 1న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.




వృద్ధుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు చట్టాలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. జాతీయ వృద్ధుల విధానం--1999 ద్వారా వృద్ధులకు సాధికారత కల్పించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, భరణం మరియు సంక్షేమ చట్టం--2007 వృద్ధులకు చట్టపరమైన రక్షణ కల్పిస్తుందని తెలిపారు. నిర్లక్ష్యానికి గురయ్యే వృద్ధులు పిల్లలు లేదా చట్టపరమైన వారసుల నుంచి భరణం పొందేందుకు ఈ చట్టం అవకాశం కల్పిస్తుందని వివరించారు. వృద్ధుల ఆస్తిని తీసుకుని వారిని నిర్లక్ష్యం చేసిన సందర్భాల్లో ఆస్తి హక్కులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. లీగల్ ఎయిడ్ సభ్యుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. వృద్ధులు తమకు ఎదురయ్యే చట్టపరమైన సమస్యలపై జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. 15100 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి న్యాయ సహాయం




పొందవచ్చని చెప్పారు. జిల్లాలోని వృద్ధాశ్రమాలను పర్యవేక్షిస్తూ వృద్ధుల సంక్షేమానికి అవసరమైన సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. న్యాయవాది పాపారావు మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్ల రక్షణ కోసం 14567 జాతీయ హెల్ప్‌లైన్ అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వృద్ధుల సంక్షేమ చట్టం--2007పై రూపొందించిన గోడ పోస్టర్లను జిల్లా జడ్జి పి. వాసు ఆవిష్కరించారు. అనంతరం వృద్ధులతో కలిసి అల్పాహారం చేశారు. జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు చీరలను పంపిణీ చేశారు. వృద్ధుల ఆరోగ్య సమస్యలను గుర్తించేందుకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రక్తపరీక్షలు, రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, న్యాయవాది పాపారావు, డాక్టర్ చిన్మయి, మన వృద్ధుల ఆశ్రమ నిర్వాహకులు ఇస్మాయిల్, వృద్ధులు పాల్గొన్నారు.

# రూ.29.30 లక్షల విలువైన ఎసోఫేజియల్ మానోమెట్రీ పరికరం ప్రారంభం

## కర్నూలు జీజీహెచ్‌లో ఉచితంగా ఆధునిక వైద్య సేవలు

కర్నూలు, అక్టోబర్ 1: (మహి న్యూస్): కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రూ.29.30 లక్షల విలువైన హై రెజల్యూషన్ ఎసోఫేజియల్ మానోమెట్రీ పరికరాన్ని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్త గురువారం ప్రారంభించారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన ఈ పరికరం ద్వారా జీర్ణాశయ సంబంధిత సమస్యలను మరింత సూక్ష్మంగా గుర్తించి చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాయలసీమలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ తరహా పరికరం అందుబాటులో లేదని, కర్నూలు జీజీహెచ్‌లో ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు ఆధునిక వైద్య సేవలు ఉచితంగా అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ పరీక్షకు సుమారు రూ.10 వేలు, హైదరాబాద్‌లో మరింత అధికంగా ఖర్చయ్యే అవకాశం ఉందన్నారు. కర్నూలు జీజీహెచ్‌ను కార్పొరేట్ స్థాయి ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక వసతులు, వైద్య పరికరాలు





సమకూరుస్తున్నామని మంత్రి తెలిపారు. ఆసుపత్రి భవనాల్లో వర్షపు నీటి లీకేజీల సమస్యను పరిష్కరించేందుకు సుమారు రూ.2.5 కోట్లతో మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆసుపత్రి అభివృద్ధికి మంత్రి టీజీ భరత్ గుప్త ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ఆసుపత్రి భవనాల మరమ్మతులకు సుమారు రూ.2.5 కోట్లు వెచ్చించి సమస్యను పరిష్కరించారని పేర్కొన్నారు. ఎండోక్రైనాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ పరికరం తొలిసారిగా కర్నూలు జీజీహెచ్‌లో అందుబాటులోకి వచ్చిందన్నారు. ఎసోఫేగస్‌కు సంబంధించిన సమస్యలను అత్యంత సూక్ష్మంగా గుర్తించేందుకు ఈ పరికరం ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ మోహన్‌రెడ్డి, విశ్రాంత వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ, డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ కిరణ్ కుమార్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ ప్రవీణ్, సాయి ప్రదీప్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా యువజనోత్సవాల్లో ప్రతిభ చాటిన యువత

## ఐదు విభాగాల్లో విజేతలకు బహుమతులు

కర్నూలు, అక్టోబర్ 1: (మహి న్యూస్): కర్నూలు జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దుపాడులోని అశోకా ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జిల్లా యువజనోత్సవాల్లో యువత ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఐదు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

జానపద గీతం: ప్రథమ--దివ్య గ్రూప్ (డా. బీఆర్ అంబేద్కర్ గురుకులం, దిన్నెదేవరపాడు), ద్వితీయ--రాహుల్ గ్రూప్ (బీఆర్ అంబేద్కర్ గురుకులం ఐఐటీ, నీట్ అకాడమీ), తృతీయ--లావణ్య గ్రూప్ (ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఆరేకల్).





చిత్రలేఖనం: ప్రథమ--యాషెస్ (సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల), ద్వితీయ--దూదేకుల రేష్మ (శ్రీవిద్యా సాయి ఇన్‌స్టిట్యూషన్స్), తృతీయ--నాగ రమ్యశ్రీ (ఎంజేపీఏపీ బీసీ రెసిడెన్షియల్, ఆరేకల్).

కవితా రచన: ప్రథమ--హారిక (గవర్నమెంట్ జూనియర్ కళాశాల, టౌన్ మోడల్), ద్వితీయ--మౌనిక (కేజీబీవీ, ఆస్పరి), తృతీయ--రామ్‌రెడ్డి (డా. బీఆర్ అంబేద్కర్ గురుకులం, చిన్నటేకూరు).

వీధి నాటకం: ప్రథమ--కృష్ణకుమార్ గ్రూప్ (సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల), ద్వితీయ--కుమారి గ్రూప్ (ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికలు, వెల్దుర్తి), తృతీయ--షేక్ హర్షిఫా గ్రూప్ (గవర్నమెంట్ జూనియర్ కళాశాల, ఎమ్మిగనూరు).

జానపద నృత్యం: ప్రథమ--మల్లిక గ్రూప్ (డా. బీఆర్ అంబేద్కర్ గురుకులం, దిన్నెదేవరపాడు), ద్వితీయ--అప్సర గ్రూప్ (గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, పత్తికొండ), తృతీయ--ప్రధి ప్రతి గ్రూప్ (కేవీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల).

జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ కె. వేణుగోపాల్ మాట్లాడుతూ.. యువతలో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికితీయడం, సృజనాత్మకతను ప్రోత్సహించడం, నైపుణ్యాలను అభివృద్ధి చేయడం యువజనోత్సవాల ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ అభినందించారు. జిల్లా యువజనోత్సవాల్లో 800 మందికి పైగా యువత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగకరంగా ఉంటాయని అధికారులు పేర్కొన్నారు.

# పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి




రాయచోటి, మహి న్యూస్, అక్టోబర్ 01 : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయుష్ వైద్యులు నూర్ అలీషా, సౌభాగ్య లక్ష్మి లు సూచించారు. గురువారం రావిచెట్టు పట్టణ కేంద్రంలో వైద్య శిబిరం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సీజనలో మలేరియా, డెంగీ, చికున గున్యా వ్యాపించే అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధులు ప్రబలడానికి దోమలేకారణమని ఆ దోమలు విజృంభించకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల వల్లవచ్చే జబ్బుల గురించి సరైన అవగాహన ప్రజలలో వచ్చినపుడే ప్రజల ఆరోగ్యం బాగుపడుతుందన్నారు.

## ప్రతి ఒక్కరికి ఆర్థిక భరోసా కల్పించాలన్నదే చంద్రబాబు లక్ష్యం

### రాయచోటి అభివృద్ధికి చిరునామా మంత్రి రాంప్రసాద్ రెడ్డి : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్ బాషా



రాయచోటి, మహిన్యూస్, అక్టోబర్ 01: వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, దివ్యాంగులు తీసుకుంటున్న పెన్షన్ వారి జీవన ప్రయాణంలో ఎంతో ఉపయోగపడుతుందని గాజుల ఖాదర్బాషా పేర్కొన్నారు. గురువారం ఆయన వీరభద్ర స్వామి దేవాలయం వీధి, మార్కెట్ వీధి నందు సీఎం చంద్రబాబు, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ ఆదేశాలతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి సూచనలతో ఇంటింటికి వెళ్లి గాజుల ఖాదర్బాషా సచివాలయ సిబ్బందితో పెన్షన్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు వృద్ధులు, వితంతువులు, వికలాంగులు దివ్యాంగులు చంద్రబాబుకు దీవెనలు అందిస్తున్నారని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ పార్టీకి ఒక్క సీటు కూడా ఎక్కడ రాదని పెన్షనర్ల దీవెనలు అన్నియు కూటమి ప్రభుత్వానికి ఉన్నాయన్న విషయం వారి నోటి నుండి ప్రతి ఒక్కరూ చెబుతున్నారని తెలియపరిచారు. చంద్రబాబు ద్వారానే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రాయచోటి నియోజకవర్గం కూడా మంత్రి మండిపల్లిరాంప్రసాద్ తోనే అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

## 11వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ





కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ అక్టోబర్ 02: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా పింఛన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రమణారెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి గుర్రప్ప, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ మల్లికార్జున, జింకల భాషా, ప్రతాప్ రెడ్డి, చంద్ర ఓబుల్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, జయచంద్రతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల సేవలో 2.0కు విశేష స్పందన..

### పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి




కడప జిల్లా/జమ్మలమడుగు,మహి న్యూస్: అక్టోబర్ 01: పేదలకు అండగా నిలుస్తూ వారి సంక్షేమం కోసం నిర్వహిస్తున్న 'పేదల సేవలో 2.0' కార్యక్రమం జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు గ్రామం కోతి సమాధి వద్ద ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పాల్గొని సేవా కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



పేదలు, నిరుపేద కుటుంబాలకు అవసరమైన సహాయం అందించేందుకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకుని, సాధ్యమైన మేరకు పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శిరీష, పార్టీ సీనియర్ నాయకులు రమణారెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఎంఆర్ఓ సాయినాథరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి



ప్రొద్దుటూరు, అక్టోబర్ 1, (మహి న్యూస్): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 5న ప్రొద్దుటూరులో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. జలజీవన్ మిషన్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై గురువారం ప్రొద్దుటూరు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సభా ప్రాంగణం, వేదిక, బారికేడింగ్, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య ఆరోగ్యం, అగ్నిమాపక, భద్రత తదితర ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.



తొలుత కలెక్టర్, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా తదితరులతో కలిసి బహిరంగ సభ ప్రాంగణం, హెలిప్యాడ్ ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలు, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి తొలిసారిగా ప్రొద్దుటూరుకు వస్తున్నందున పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో ఏపీ షెక్స్ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వి.ఎస్. ముక్తియార్, ప్రొద్దుటూరు ఏఎస్పీ కృష్ణ, వివిధ ఆర్డీవోలు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ జాన్ ఇర్విన్, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# కోర్టులో నిలబడేలా రిజర్వేషన్లు ఇవ్వాలన్న చిత్తశుద్ధి చంద్రబాబుకు లేదు

### బీసీల హక్కులతో రాజకీయాలు చేయడం మానుకోవాలి

### వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్




రాయచోటి, మహిన్యూస్, అక్టోబర్ 01: రాష్ట్రంలోని బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని గొప్పగా ప్రచారం చేసుకున్న చంద్రబాబు ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 105, 1065పై న్యాయపరమైన ప్రశ్నలు తలెత్తడం బీసీ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ అన్నారు. బీసీలకు న్యాయం చేయాలన్న చిత్తశుద్ధి ఉంటే రాజ్యాంగబద్ధంగా, న్యాయపరంగా నిలబడే విధంగా రిజర్వేషన్లను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలోనూ స్థానిక సంస్థల రిజర్వేషన్లపై న్యాయపరమైన వివాదాలు తలెత్తిన విషయం తెలిసినప్పటికీ, అదే తరహాలో మళ్లీ జీవోలు జారీ చేయడం ఎందుకని ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ జారీ చేసిన జీవోలు 105, 1065పై హైకోర్టులో దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా ప్రభుత్వం ఆ రిజర్వేషన్లకు ఆధారమైన గణాంకాలు, నివేదికలు, చట్టపరమైన ప్రాతిపదికను సమర్పించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. రిజర్వేషన్లు ఇవ్వాలంటే ముందుగా చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేయాలని, అవసరమైన గణాంకాలను సమగ్రంగా సిద్ధం చేయాలన్నారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా చర్యలు తీసుకోవాలని, ఇవేవీ చేయకుండా జీవోలు ఇచ్చి ప్రచారం చేసుకోవడం వల్ల చివరకు నష్టపోయేది బీసీలే అని శిబ్యాల విజయభాస్కర్ అన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని, రిజర్వేషన్లకు ఆధారమైన గణాంకాలు, చట్టపరమైన ప్రక్రియ, న్యాయపరమైన రక్షణపై సమగ్ర వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు. బీసీలకు కోర్టులో నిలిచే చట్టబద్ధమైన రిజర్వేషన్లే కావాలని విజయ భాస్కర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు పురం హరినాథ్, పురం శ్రీరాములు, పలువురు పాల్గొన్నారు.

# కడపలో ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం...






కడప మహి న్యూస్ అక్టోబర్ 1.: "మెగా న్యూ మాడ్యూల్ క్యాంప్ (అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం)" సందర్భంగా నగరపాలక ఉన్నత పాఠశాల (గాంధీనగర్ హైస్కూల్), గాంధీనగర్, కడప నందు గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు మరియు వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేసి, పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గౌరవ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయధికారి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప. జి .రామ గోపాల్ మాట్లాడుతూ, వృద్ధులు సమాజానికి మార్గదర్శకులని, వారి అనుభవాలు యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. వృద్ధుల హక్కులను గౌరవించాలని, వారికి తగిన ప్రేమ, ఆదరణ, రక్షణ కల్పించాలని సూచించారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, చిన్నతనం నుంచే పెద్దలను గౌరవించడం, తల్లిదండ్రులు, తాతయ్యలు, నానమ్మల పట్ల ప్రేమాభిమానాలు చూపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు మాట్లాడుతూ.. "సృష్టిలో తల్లిదండ్రులు, వృద్ధులు అందించిన త్యాగాలను, సేవలను ఎప్పటికీ మరవలేము. నేటి సమాజంలో వృద్ధులకు రక్షణగా నిలవాల్సిన బాధ్యత మన అందరిపై ఉంది. వృద్ధులను కేవలం బాధ్యతగా కాకుండా, కుటుంబానికి మూలస్తంభాలుగా భావించి వారిని ప్రేమతో చూసుకోవాలి" అని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి వారు ప్రసంగిస్తూ.. చిన్ననాటి నుంచే విద్యార్థులలో మానవ విలువలు, పెద్దలపట్ల గౌరవభావం పెంపొందాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులను, గురువులను, వృద్ధులను కంటికి రెప్పలా కాపాడుకోవడం మన సాంప్రదాయమని, భావి భారత పౌరులైన విద్యార్థులు పెద్దలను గౌరవించే గుణాన్ని అలవర్చుకోవాలని హితబోధ చేశారు. వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరియు న్యాయ సేవా అధికార సంస్థ అందిస్తున్న ఉచిత సేవలు, ప్రత్యేక చట్టాల గురించి కూడా ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గౌరవ చైర్మన్ శాశ్వత లోక్ అదాలత్, కడప వారు స్వర్ణ ప్రసాద్, గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు, ఆర్ డి ఓ, కడప ఎ.మురళి, ఏడీ వికలాంగుల ఆర్.వి.కృష్ణ కిషోర్, డీఎస్పీ ఇ. బాల స్వామి రెడ్డి, సీఐ పి. తిమ్మ రెడ్డి, యం డి హెచ్ ఓ యుగంధర్, అసిస్టెంట్ యం డి హెచ్ ఓ రవి కుమార్, డి ఇ ఓ యస్.షంషుద్దీన్, కడప మున్సిపల్ కమీషనర్ పి. భవాని ప్రసాద్, కడప యం.ఆర్.ఓ యస్ మహబూబ్ చాంద్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, వృద్ధులు, పాఠశాల విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు ఇతరులు పాల్గొన్నారు.





# స్వచ్ఛంద రక్తదానంతో బాధితుల్లో భరోసా నింపుదాం

### యువత పెద్దఎత్తున రక్తదానానికి ముందుకు రావాలి

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. పి. యుగంధర్







కడప, అక్టోబరు 01 (మహి న్యూస్): రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడటంతో పాటు, బాధిత కుటుంబాల్లో భరోసా నింపవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. పి. యుగంధర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా సేవలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఏపీఎస్ఏసీఎస్ ఆదేశాల మేరకు కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రక్తనిధి కేంద్రం సహకారంతో గురువారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. పి. యుగంధర్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు క్షయ నివారణ అధికారి డా. ఎస్. రవి బాబు, ఉమ్మడి జిల్లాల ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ కార్యక్రమ అధికారి వేంపల్లి భాస్కర్ తదితరులు శిబిరాన్ని ప్రారంభించారు. ప్రతి సంవత్సరం అక్టోబరు 1న జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు 14 రోజుల పాటు స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా కూడా యువత పెద్దఎత్తున రక్తదానం చేయాలని డా. యుగంధర్ కోరారు. రక్తదానం చేయదలచిన వారు అర్హతా ప్రమాణాలను పాటించాలని అధికారులు సూచించారు. సాధారణంగా 18 నుంచి 65 సంవత్సరాల మధ్య వయస్సు, తగిన శరీర బరువు, సాధారణ రక్తపోటు, హిమోగ్లోబిన్ స్థాయిలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నవారు రక్తదానం చేయవచ్చని తెలిపారు. జలుబు, జ్వరం వంటి అనారోగ్య పరిస్థితులు, ఇటీవల టాటూలు లేదా పియర్సింగ్‌లు చేయించుకోవడం, కొన్ని రకాల దీర్ఘకాలిక మందుల వినియోగం వంటి పరిస్థితుల్లో రక్తదానాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాల్సి ఉంటుందని వివరించారు. డా. ఎస్. రవి బాబు మాట్లాడుతూ స్వచ్ఛంద రక్తదాతల సేవలను అభినందిస్తూ, రక్తదానం ప్రాముఖ్యతపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రక్తదానం చేసేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. వేంపల్లి భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన రక్తనిధి కేంద్రాల్లోనే రక్తదానం చేయాలని సూచించారు. సురక్షితమైన రక్తం అందుబాటులో ఉండేందుకు గుర్తింపు పొందిన రక్తనిధుల ద్వారా మాత్రమే రక్తదానం, రక్తసేకరణ జరగాలని తెలిపారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రక్తనిధి కేంద్రం వైద్యాధికారులు డా. సింధుజ, డా. రాజేంద్ర, డా. సంధ్య, డా. వినయ్, డీఐఎస్‌హెచ్ఏ సిబ్బంది, రక్తనిధి సిబ్బంది విశ్వనాథ్ రెడ్డి, రాజ్ ఖాన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అవసరాలే ప్రాధాన్యంగా అభివృద్ధి ప్రణాళికలు...!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### అక్టోబర్ 2న 629 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు..

### ప్రజల భాగస్వామ్యంతో పనుల గుర్తింపు



**కడప, మహి న్యూస్ అక్టోబరు 01:** గ్రామాల స్థానిక అవసరాలను ప్ర. అయిజల భాగస్వామ్యంతో గుర్తించి, వాటికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. అక్టోబరు 2న జిల్లాలోని 629 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి, 2027--28 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గ్రామస్థాయిలోనే గుర్తించనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ సభల్లో ప్రజలు, కూలీలు, ప్రజాప్రతినిధులు తమ గ్రామాలకు అవసరమైన పనులను సూచించాలని కలెక్టర్ కోరారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇచ్చి, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి భద్రత, గ్రామీణ మౌలిక సదుపాయాలు, గ్రామీణ జీవనోపాధుల మెరుగుదల, తీవ్రమైన వాతావరణ పరిస్థితులు--విపత్తుల నివారణ వంటి నాలుగు ప్రధాన రంగాల్లో పనులను గుర్తించనున్నట్లు తెలిపారు. ఈ విభాగాల్లో మొత్తం 375 రకాల పనులకు అవకాశం ఉందన్నారు. నీటి నిల్వ గుంతలు, కొండ వాలులో కందకాలు, చేపల చెరువులు, చెరువుల పునరుద్ధరణ, పొలాల్లో నీటి నిల్వ నిర్మాణాలు, పండ్ల తోటలు, పుష్ప సాగు, పశువుల కొట్టాలు, గడ్డి పెంపకం వంటి పనులతో పాటు సిమెంట్ రహదారులు, గ్రామీణ రహదారులు, గ్రామ పంచాయతీ భవనాలు, గ్రంథాలయాలు, శ్మశానవాటికల అభివృద్ధి, శీతల గిడ్డంగులు, గ్రామీణ గృహ నిర్మాణ పనులను కూడా ప్రణాళికలో చేర్చనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామ సభల్లో గుర్తించిన పనులకు అవసరమైన సాంకేతిక వివరాలను సిద్ధం చేసి, నిబంధనల మేరకు పనుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల ప్రాధాన్యతలు, ప్రజల అవసరాలకు అనుగుణంగా రూపొందించే ఈ ప్రణాళికలు స్థానిక అభివృద్ధికి మరింత దోహదపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com